నవతెలంగాణ
ఆదిలాబాద్
సోమవారం | ఫిబ్రవరి 12, 2024 | www.navatelangana.com

ఎంపీడీఓ, తహసీల్దార్ల బదిలీ

నవతెలంగాణ-జైపూర్

లోక సభ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అధికారుల బదిలీల్లో ఉమ్మడి మండలంలో గల పలువురు అధికారులు బదిలీ అయ్యారు. జైపూర్ ఎంపీడీఓ సత్యనారాయణ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ కాగా భీమారం ఎంపీడీఓ శ్రీనివాస్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వెలుతున్నారు. అదేవిధంగా భీమారం తహసీల్దార్ విశ్వంబర్ ఇక్కడి నుండి జగిత్యాలకు బదిలీపై వెలుతున్నారు. ఎస్సై రాజవర్ధన్ ఇక్కడి నుంచి రామగుండం కమీషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కమాన్‌పూర్ ఎస్ఐ రాములు భీమారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టనున్నారు.

జన్నారం : తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీఓ అరుణ రాణి బదిలీ అయ్యారు. ఎంపీడీఓగా ఐదున్నర సంవత్సరాలు మండల ప్రజలకు సేవలందించిన అరుణాని నిర్మల్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఎమ్మెల్యే ఎన్నికల ముందు వచ్చిన తహసీల్దార్ వేణుగోపాల్ మంచిర్యాల జిల్లా కలెక్టరేట్, డీఎస్ఓ సూపర్డెంట్‌గా బదిలీపై వెళ్లారు. వచ్చే సాధారణ ఎంపీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఉన్నత అధికారులు ఈ బదిలీలను నిర్వహించినట్లు ఎంపీడీఓ అరుణ రాణి, తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు.

రాజా విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థుల అన్నదానం

నవతెలంగాణ-తాండూర్

బెల్లంపల్లి పట్టణంలోని రాజా విద్యానికేతన్ పూర్వ విద్యార్థులు అమ్మ ఒడి ఎన్‌జీఓ అన్నదాత ప్రాజెక్టు టెక్నో డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఆదివారం నిర్విరామంగా అన్నదానం కొనసాగించే అమ్మ ఒడి ఎన్జీవోకు సహకారాన్ని అందించారు. కోవిడ్ సమయంలో అమ్మ ఒడి ఎన్జీఓచే ప్రారంభించబడి శరణార్థుల ఆకలి తీరుస్తూ కొనసాగుతున్న 235వ వారాలు అన్నదానం విజయవంతంగా కొనసాగింది. సోల్లేటి రాజారెడ్డి జ్ఞాపకార్థంగా రాజా విద్యానికేతన్ హైస్కూల్ బెల్లంపల్లి 2001-2002, 10వ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు కె.విజయ్ సార్, కొట్టె రమేష్, బంగారి నాగరాజు, షాహిద్ అలి, సోల్లేటి సందేశ్‌రెడ్డి అమ్మ ఒడి సభ్యులు హనుమాండ్ల సువర్ణ, నారయణ, మేదరి రవి, సిద్దమల్ల రఘు, చెందుపట్ల లింగమూర్తి, యూసుఫ్ పాల్గొన్నారు.

ఫుట్ బాల్ విజేతలకు బహుమతులు ప్రదానం

నవతెలంగాణ-మందమర్రి

పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో ఏఆర్ డీఎస్పీ శశిధర్ స్మారకార్థం రెండు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ ఫైనల్ పోటీలకు ఆదివారం ముఖ్య అతిథిగా మంచిర్యాల జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీ హాజరై విజేత రూ.20,000, రన్నరప్ రూ.10,000 బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ సీఐ కిషన్, అంజనీపుత్ర ఎస్టేట్ ఎండీ పిల్లి రవి, ఆర్కేపీ ఎస్ఐ రాజశేఖర్, ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, మార్కెట్ అధ్యక్షులు తమ్మిశెట్టి విజయ్, కాంగ్రెస్ నాయకులు, ఫుట్ బాల్ టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

సోమ, బుధవారాల్లో ఆన్‌లైన్ ఆస్తి పన్ను చెల్లింపులపై రెవెన్యూ మేళా

నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మున్సిపల్ పరిధిలోని ఆన్‌లైన్ ఆస్తి పన్ను చెల్లింపులపై ప్రతి సోమ, బుధవారాల్లో రెవెన్యూ మేళా నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పురపాలక పరిపాలన శాఖ హైదరబాద్, ఎండాస్మెంట్ ఆదేశాలు, కలెక్టర్ సమాచారం మేరకు 2023-24 ఆర్థిక సంవత్సరంనకు సంబందించిన ఆస్తి పన్నులు 100 శాతం బాకాయిల వసూళ్లకు ఏవైనా సందేహాలు ఉన్నట్లయితే వాటి పరిష్కారనికి ఈ మేళా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ రెవెన్యూ మేళా మార్చి 31 వరకు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ ప్రజలు 2023-24 ఆర్థిక సంవత్సరంకు సంబందించిన ఆస్తి పన్నులు మార్చి 31 లోపు ముందస్తుగా చెల్లించాలని లేని పక్షంలో ప్రతి నెలా తెలంగాణ పురపాలక చట్టం 2019, సెక్షన్ 100(2) ప్రకారం 2 శాతం వడ్డీ విధింస్తామని, చెల్లించని వారికి తెలంగాణ పురపాలక చట్టం 2019, సెక్షన్ 87 ప్రకారం అట్టి వారి ఆస్తులు జప్తుచేయడం జరుగుతుందని తెలిపారు.

రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సన్మానం



నవతెలంగాణ-జన్నారం

మండల రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మండలంలోని దేవుని గూడా గ్రామపంచాయతీ సర్పంచ్‌గా విధులు నిర్వహించి జనవరి 31న పదవి విరమణ పొందిన సర్పంచ్ గుర్రం శిరీష గోపాల్‌రెడ్డిని, అలాగే అదే గ్రామానికి చెందిన రెడ్డి సంఘం నాయకుడు రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగి గుర్రం ఇందిరా సుధాకర్‌రెడ్డిలను ఆదివారం దేవుని గూడా గ్రామంలో శాలువా పూలమాలలతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా రెడ్డి సంఘం నాయకులు గుర్రం రాజారామ్‌రెడ్డి ఏనుగు సుభాష్‌రెడ్డి గుర్రం మోహన్‌రెడ్డిలు మాట్లాడుతూ, గ్రామాన్ని అభివృద్ధి చేయడంలో శిరీష గోపాల్‌రెడ్డి సేవలు మరువలేనివన్నారు. వారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీరాముల సరిత, రెడ్డి సంఘం నాయకులు రామచంద్రారెడ్డి, పోన్కల్ పీఏసీఎస్ వైస్ చైర్మన్ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి హామీని సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తాండూర్



నైపుణ్యతలేని కూలీల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాజీవ్‌నగర్, మాదారం స్పెషల్ ఆఫీసర్ డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు. ఆదివారం రాజీవ్ నగర్ పంచాయతీలో ఉపాధిహామీ ఏపీఓ నందకుమార్‌తో కలిసి ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నైపుణ్యత లేని కూలీల కోసం ఉపాధి హామీలో భాగంగా ప్రతి సంవత్సరం 100 రోజులపని దినాలను కల్పిస్తుందని తెలిపారు. వ్యవసాయ ఆధారిత కూలీలు దినసరి కూలీలు ఉపాధి హామీని వినియోగించుకోవాలని సూచించారు. ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వం దినసరి వేతనాన్ని రూ.267 నిర్ణయించిందని తెలిపారు. రాజీవ్‌నగర్ పంచాయతీలోని పేద ప్రజలకు ఉపాధి కల్పించేందుకు అటవీ శాఖ పరిధిలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి కల్పన, మేట్ లక్ష్మి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌పై కేసు నమోదు

నవతెలంగాణ-మందమర్రి

బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌పై మందమర్రి పోలీసులు కేసు నమోదు చేసారు. మందమర్రి పట్టణానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు బెల్లం అశోక్, విరుగురాల సాయి వికాస్‌లు వాట్సాప్ గ్రూప్‌లలో, ఫేస్బుక్ అకౌంట్‌లలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి చెప్పుల దండ వేసి ఉన్నటువంటి ఫోటోను షేర్ చేయడంతో వారిద్దరిపై ఎస్సై చంద్రకుమార్ శనివారం కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇతరులను అవమాన పరిచేవిధంగా కానీ, రెండు వర్గాలను, రెండు పార్టీలకి చెందిన వ్యక్తులను గానీ రెచ్చగొట్టే ప్రకటనలు చేసినా, సోషల్ మీడియాలో పోస్టులు చేసి శాంతి భద్రతలకు భంగం కలిగించినట్లయితే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అటవీ ప్రాంతంలో శిక్షణ సెక్షన్ అధికారుల పర్యటన

నవతెలంగాణ-బెజ్జూరు

దూలపల్లి ఫారెస్ట్ అకాడమిలో శిక్షణ పొందుతున్న 22 మంది అటవీ సెక్షన్ అధికారులు ఆదివారం బెజ్జూరు అటవీ ప్రాంతంలో పర్యటించారు. దూలపల్లి ఫారెస్ట్ అకాడమి అసిస్టెంట్ కోర్స్ డైరెక్టర్ రామ్మోహన్ ఆధ్వర్యంలో ఇక్కడి అడవుల విశిష్టతపై వివరించారు. కృష్ణపల్లి సెక్షన్ పరిధిలోని కమ్మర్‌గాం బీట్‌లో రాముడు, భీముడు టేకు చెట్లు, వడ్డిక్ క్షేత్రాల గురించి తెలియజేశారు. ఇక్కడి అటవీ సంపదతో పాటు జీవ వైవిధ్యంపై గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి శ్రావన్, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దాం

- మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ ప్రకటిద్దాం
- 16న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేద్దాం
- సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబు



సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్

కేంద్రంలోని బీజేపీ సర్కార్ అవలంభిస్తున్న కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటిద్దామని, మోడీ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ ప్రకటించి ఈ నెల 16న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం. సాయిబాబు అన్నారు. భారత్ బంద్ సందర్భంగా పట్టణంలో సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం సన్నాహక సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సాయిబాబు మాట్లాడుతూ సబ్ కా సాత్ సబ్ కా వికాస్ అని చెపుతున్న మోడీ ప్రభుత్వం కార్పొరేట్‌లకు ఊడిగం చేస్తోందన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక ఆదాని ఒకరోజు సంపాదన 16 వందల కోట్లు కాగా సామాన్య కార్మికుడి ఒకరోజు వేతనం రూ. 260గా మారిందన్నారు. కార్మికుడు సృష్టించిన సంపద కార్పొరేట్ చేతులలోకి వెళ్తుందన్నారు. సంపద మొత్తం ఒక దగ్గర పోగవుతోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతుందన్నారు. ఇప్పటికే 450 రైల్వే స్టేషన్‌లను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించిందన్నారు. కనీస వేతనాలు పెంచడం లేదని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిందని, 50 సంవత్సరాల నుండి ఊడిగం చేస్తున్న కార్మికులకు ఒక రూపాయి పెన్షన్లు లేవన్నారు. కార్మికులందరికీ కనీస పెన్షన్ రూ. 10,000 ఇవ్వాలని, కార్మికులందరికీ కనీస వేతనం, ఉద్యోగ భద్రత, రైతులకు కనీస మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మొదటిసారి రైతులు, కార్మికులు కలిసి ఈ నెల 16న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని, పోరాట వీరుడు కుమురం భీం స్ఫూర్తితో సమ్మె విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శులు బి.మదు, వంగూరి రాములు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జాదవ్ రాజేందర్, ముంజం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు త్రివేణి, శ్రీకాంత్, కృష్ణమాచారి, మొరేశ్వర్, శామ్‌రావు, ప్రభాకర్, అంకన్న, శంకర్, సంజీవ్, మాయ, రూప, వనిత, పద్మ, స్వరూప, డీవైఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి కార్తీక్, ఎస్ఎఫ్ఐ నాయకులు చాపిలే సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేసింది

- ఉపాధ్యాయ బదిలీలు వెంటనే చేపట్టాలి
- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యానందం



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

గత ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ బడ్జెట్‌లో నిధులు పెంచడం హర్షనీయమని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సత్యానందం అన్నారు. ఆదివారం జిల్లా విస్తత స్థాయి సమావేశాన్ని స్థానిక డైట్ కళాశాలలో నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యారంగంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సత్యానందం మాట్లాడుతూ.. విద్యారంగాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద పీఠ వేస్తు బడ్జెట్‌లో గత ప్రభుత్వం కంటే ఒక శాతం పెంచిందన్నారు. గత ప్రభుత్వంలా వ్యవహరించకుండా ఉపాధ్యాయుల సమస్యలపై శ్రద్ధ చూపాలని కోరారు. మల్టిజోన్‌లలో బదిలీలు, పదోన్నతులు జరిగాయని తెలిపారు. విద్యాశాఖ నిర్లక్ష్యం వల్ల, అసమగ్ర విధానాల వల్ల నష్టపోయిన బాధితులు వివిధ అంశాలపై కోర్టు ఆశ్రయించారన్నారు. కోర్టు తీర్పులవల్ల బదిలీలు పదోన్నతులు ప్రక్రియ నిలిచిపోయిందని ప్రభుత్వం చొరవ చూపి బదిలీలు పదోన్నతుల ప్రక్రియను పునఃప్రారంభించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్, జిల్లా అధ్యక్షుడు ఎం.స్వామి, ప్రధాన కార్యదర్శి వి.అశోక్, ఉపాధ్యక్షుడు టి.సూర్య కుమార్, కోశాధికారి కె.కిష్టన్న, జిల్లా కార్యదర్శులు కె.శ్రీనివాస్, ఎ.ఇస్తారి, పి.స్వరూపరాణి, కుమ్మ శ్రీనివాస్, ఎం.శ్యాంసుందర్ సోషల్ మీడియా కన్వీనర్ కె.శంకర్ పాల్గొన్నారు.



'ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలి'

- ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు పైళ్ళ ఆశయ్య



నవతెలంగాణ-హాజీపూర్

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలని ప్రజా సంఘాల రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అధ్యక్షతన ప్రజా సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పైళ్ల ఆశయ్య మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక, రైతంగా సమస్యలను గాలికొదిలేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్, కార్పొరేట్, పెట్టుబడుదారులకు దారాదత్తం చేస్తూ వారికి అనుగునంగా కార్మిక చట్టాలను తెస్తుందన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నా ప్రభుత్వం మాటలు నీటి మూటలుగా మారి నిరుద్యోగులను మోసం చేసిందని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చెల్లించాలని, ఉపాధి హామీ పనులు ప్రతి కుటుంబానికి రెండు వందల రోజులు పనులు కల్పిస్తూ, రోజుకి ఆరు వందలు కూలీ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 16న నిర్వహించే దేశ వ్యాప్త కార్మికుల సమ్మె-గ్రామీణ భారత్ బంద్‌ను అన్ని గ్రామాల్లో, వార్డుల్లో, పట్టణాల్లో జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దాసరి రాజేశ్వరి, సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్, దూలం శ్రీనివాస్, గోమాస అశోక్, దేవదాసు, బోడేంకి చందు, సభ్యులు రాజేశం, రాందాస్ పాల్గొన్నారు.

బోథ్‌లో అభివృద్ధి పనులకు భూమి పూజ



నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలోని స్థానిక ఆరవ, 15వ వాడలో పలు అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఆడే గజేందర్ సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేవారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి రూ.6 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. అలాగే నియోజకవర్గంలోని ఆయా గ్రామాలలో సీసీ రోడ్లు మురికి కాలువలు కల్వట్లు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. అలాగే నియోజకవర్గంలోని మంత్రి సీతక్క సహాయ సహకారాలతో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు కురుమే మహేందర్, రజియా బేగం, నాయకులు ప్రబుల్‌రెడ్డి, మహమ్మద్, ఇట్టడి రాజు, గంగాధర్, బొడ్డు గంగారెడ్డి, వంశిరెడ్డి, సాయికిరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

మండలంలోని వెంకట్రావుపేట, కొత్తకొమ్ముగూడెం , దౌడేపల్లి గ్రామల్లో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు భూమి పూజ చేసి ప్రారంభించారు. పలు సీసీ రోడ్డులు, కాలువల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం స్థానిక నాయకులు, ప్రజలతో సమావేశమయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్దే లక్ష్యంగా ముందుకు వెళ్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎంఆర్ఓ రాఘవేంద్రరావు, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీఓ విజయ్ ప్రసాద్, ఎంపీపీ అన్నం మంగ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మండల అధ్యక్షుడు పింగిళి రమేష్ పాల్గొన్నారు.



నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- లక్షెట్టిపేట సీఐ అల్లం నరేందర్



నవతెలంగాణ-లక్షెట్టిపేట

వాహనదారులు నిబంధనలు ఉల్లంగిస్తే చర్యలు తప్పవనిలక్షెట్టిపేట సీఐ నరేందర్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలో రాష్ డ్రైవింగ్, వివిధ రకాల సైలెన్సర్‌లని బిగించి నడుపుతున్న, నిబంధనలు ఉల్లగించిన వారిని పట్టుకొని స్టేషన్‌కి తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని ఇస్తే మైనర్‌తో పాటు ఓనర్‌పై కూడా కేసు నమోదు చేయడం జరుగుతుందని, రాష్ డ్రైవింగ్ చేసిన, బారి సౌండ్ వచ్చే సైలెన్సర్ బిగించి రోడ్లపై తిరిగిన ఐపీసీ 279 సెక్షన్ ప్రకారం వాహనం సీజ్ చేసి కోర్టుకు పంపించడం జరుగుతుందన్నారు. వాహనానికి సంబందించిన పత్రాలు దగ్గర పెట్టుకోవాలని, వాహనాలు ఇతరులకు ఇచ్చే సమయంలో వారికి లైసెన్స్ ఉందో లేదో చూసుకొని లైసెన్స్ ఉన్నవారికే వాహనాలను ఇవ్వాలన్నారు. ముఖ్యంగా తల్లితండ్రులు వాహనాలను పిల్లలకు ఇచ్చే సమయంలో జాగ్రత్త వహించి లైసెన్సు ఉంటేనే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంట ఎస్ఐ లక్ష్మణ్, ఎస్ఐ-2 రామయ్య, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ప్రపంచాన్ని శాసిస్తున్న మహిళలు

- కుట్టు మిషన్‌లను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

మహిళలు ప్రపంచాన్ని శాసిస్తూ అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని భాగ్యనగర్ కాలనీలో న్యాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కుట్టు మిషన్‌ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో మహిళలు ఎటువంటి కష్టాలను ఎదుర్కోకుండా తమ జీవనం కొనసాగించాలని ప్రధాని నరేంద్ర మోడీ అనేక పథకాలను ప్రవేశపెట్టారన్నారు. తన చిన్నతనంలో మోడీ తల్లి పడిన బాధలు చూసి నిస్సహాయ స్థితిలో ఆ రోజు ఉన్నారని కానీ తన తల్లి పడిన కష్టం దేశంలో ఏ తల్లి కూడా పడకూడదని ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారన్నారని అందులో ఉజ్వల పథకం కూడా ఒకటన్నారు. మహిళలు తమ కాళ్లపై నిలబడి తమ కుటుంబానికి సహాయంగా ఉండేందుకు వారికి అనేక రకాల వృత్తులలో శిక్షణ ఇచ్చి పెట్టుబడి లేని వారికి బ్యాంకుల ద్వారా రూ.10 లక్షల వరకు ఎటువంటి షూరిటీ లేని లోన్లను అందించే పథకాలను ప్రధాని నరేంద్ర మోడీ ప్రవేశపెట్టారన్నారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లను కుట్టు మిషన్లను పంపిణీ చేశారు.

నీటిని సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ-జైపూర్

అవసరాలకు అనుగుణంగా నీటిని వాడు కోవాలని జైపూర్ ఎంపీడీఓ సత్యనారాయణ, భీమారం ఎంపీడీఓ శ్రీనివాస్ సూచించారు. మండలాల పరిధిలో కొనసాగుతున్న ప్రత్యేక పారిశుధ్య పనుల నిర్వాహణ తీరును పర్యవేక్షించారు. గ్రామ పంచాయతీల పరిధిలో నీటి సరఫరా తీరు, నీటి వినయోగం, నీటి వృదాను అరికట్టడం తదితర విషయాలపై దృష్టి పెట్టారు. ప్రతి నెలలో ప్రతి పది రోజులకు ఒకసారి నీటి ట్యాంకులను శుభ్రపర్చాలని, నివాసల పరిసరాల్లో నీటి నిల్వలు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారి పర్యవేక్షణలో పారిశుధ్య పనులు కొనసాగుతున్నట్లు తెలిపారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు

నవతెలంగాణ-నిర్మల్

పట్టణంలోని గాజులపేటలో హజ్రత్ ఫరీద్ ఉద్దీన్ బాబా గంజ్ షాకీర్ ఉర్సు ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ మెరకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం, ఖవ్వలి కార్యక్రమం నిర్వహించారు. మత సామరస్యానికి ప్రతీకగా ఈ కార్యక్రమం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఖాజా బాబా, అజ్మత్, ముంతాజ్, రహిల్, చంద్రయ్య, హాఫిజ్, ఫహీం, ఆమెర్, అలీమ్ భక్తులు పాల్గొన్నారు.

పురుగులమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-కౌటాల

పురుగులమందు తాగి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని బోదంపెల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం బోదంపెల్లి గ్రామానికి చెందిన కొండ స్వామి(22) శనివారం ఇంటిలో తల్లి పవిత్ర, చిన్న కూతురుతో కలిసి ఆసిఫాబాద్‌లో వసతిగృహంలో ఉంటున్న కుమారుడి దగ్గరికి వెళ్లారు. తండ్రి విజయ్ వ్యవసాయ పనులకు వెళ్లాడు. మృతుడు కొంతకాలంగా తాగుడుకు బానిసై రోజూ గొడవలు చేసేవాడు. ఇంటిలో ఎవరు లేని సమయంలో మద్యం మత్తులో స్వామి పురుగులమందు తాగి బయటకు వచ్చి వాంతులు చేసుకున్నాడు. గ్రామస్తులు గమనించి అతనిని ఆస్పత్రికి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. అదే సమయంలో తల్లి పవిత్ర అక్కడికి చేరుకుంది. అతనిని వెంటనే చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్‌కు అక్కడి నుండి మంచిర్యాలకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. మృతుడి తల్లి పవిత్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | ఫిబ్రవరి 12, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్యేకు పిప్పల్‌ధరి గ్రామస్తుల సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



మండలంలోని పిప్పలధరి గ్రామంలో ఆదివారం ఎమ్మెల్యే పాయల శంకర్‌ను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఎన్నికల అనంతరం మొదటిసారిగా తమ గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేని వారు సాధారంగా ఆహ్వానించి, శాలువాలతో సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మూడుసార్లు ఓడిపోయిన నన్ను నాలుగోసారి నిరాశపరచకుండా మీ అందరూ సహకరించి, నన్ను ఎమ్మెల్యేగా చేశారని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజలందరూ ఏకతాటిపైకి వచ్చి బీజేపీ పట్టం కట్టారని అన్నారు. అనంతరం రూ.10లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు ఈ కార్యక్రమంలో నాయకులు సంతోష్, లాలా మున్న, ఆదినాథ్, అంకత్ రమేష్, సుభాష్, దరంపల్, రాకేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేద్కర్ యువజన సంఘం నిర్మల్ పట్టణ కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-నిర్మల్

తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం నిర్మల్ పట్టణ నూతన కమిటీ ఎన్నికను ఆదివారం టీఎన్జీఓ భవనంలో ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కే.వెంకటస్వామి హాజరై కమిటీని ప్రకటించారు. అంబేద్కర్ యువజన సంఘం పట్టణ అధ్యక్షుడిగా బుధవార్‌పేట్‌కి చెందిన కత్తి నవీన్, ప్రధాన కార్యదర్శిగా మంజులాపూర్‌కి చెందిన జైల లింగయ్య, కోశాధికారిగా కురున్నపేట్‌కి చెందిన నల్లూరి చందు, ఉపాధ్యక్షుడిగా గొల్లపేటకి చెందిన సింగారి అభిలాష్, సంయుక్త కార్యదర్శిగా వైయస్సార్ కాలనీకి చెందిన సుంకే ప్రశాంత్, లీగల్ అడ్వైజర్‌గా ఆర్.రత్నంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కుంటోళ్ల వెంకటస్వామి మాట్లాడుతూ నూతన పట్టణ కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని వార్డు కమిటీలు కూడా పూర్తి చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ కుమార్, జిల్లాఎలక్షన్ అధికారులు ఏ.రాజేశ్వర్, పి.రాజేశ్వర్, వెలమల ప్రభాకర్, అంబకంటి ముత్తన్నలు పాల్గొన్నారు.

పిల్లల కథల పుస్తకం ఆవిష్కరణ



నవతెలంగాణ- ఆదిలాబాద్ రూరల్

ఆదిలాబాద్ గ్రామీణ మండలం యాపల్‌గూడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు రాసిన ద స్టోరీ ఆఫ్ యాపల్‌గూడ చిల్డ్రెన్ పేరిట రాసిన కథల పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. హైదరాబాదులోని ఎన్టీఆర్ స్టేడియంలో కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య అవార్డు గ్రహీత చుక్కారపు వెంకటరమణ, బాల సాహిత్య రచయితలు డా.వీ.ఆర్.శర్మ, కోయ చంద్రమోహన్, ఆంగ్ల బాల సాహిత్య రచయిత రమాషా దివ్య చేతుల మీదుగా ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. విద్యార్థులు రాసిన కథలు చాలా చక్కగా ఉన్నాయని ప్రశంసించారు. ఇందుకు పుస్తక సంపాదకుడు, ఉపాధ్యాయుడు బుక గంగయ్య, కథలు రాసిన విద్యార్థులను అభినందించారు. వారికి సర్టిఫికేట్ ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తురాటి గంగన్న, ఉపాధ్యాయులు బావునే బాపురావు, శేక్ అలీ, హెర కుమ్ర జంగు, జాదవ్ స్వాతి, కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో జిల్లా విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

జనగామ జిల్లాలో గత 3 రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో జిల్లాలోని బంగారుగూడ మోడల్ పాఠశాల విద్యార్థులు హర్షిత, హర్షవర్ధన్, శివ శంకర్‌లు ప్రతిభ చాటి రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ ఇంగ్లీష్ మీడియం విభాగంలో 3వ స్థానంలో నిలిచారు. విద్యార్థులకు సైన్స్ కిట్‌తో పాటు మైక్రోస్కోప్, టెలిస్కోప్ పరికరాలను ముఖ్యఅతిథిగా నర్సింగరావు డైరెక్టర్ ఐఏఆర్సీఐ, శారద సైంటిస్ట్ చేతుల మీదుగా అందించడం జరిగిందని రాష్ట్రకార్యదర్శి నూతుల రవీందర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయి పోటీలో జిల్లా ప్రతిష్టను నిలబెట్టిన విద్యార్థులను గైడ్ టీచర్ జీ.సత్యనారాయణ లను డీఈఓ ప్రణీత, డీఎస్ఓ రఘురమణ, మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణి అభినందించారు.

ప్రజాపాలన దరఖాస్తుల సవరణను పరిశీలించిన తహసీల్దార్



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

ప్రజాపాలన దరఖాస్తుల సవరణను తహసీల్దార్ దిలీప్‌కుమార్ పరిశీలించారు. ఆదివారం ఇంటింటికి తిరిగి పరిశీలించారు. ఫిబ్రవరి 11 ప్రజాపాలన దరఖాస్తుల సవరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఆదిలాబాద్ మండలంలోని కచికంటి గ్రామంలో ఆదివారం రూ.500కు గ్యాస్ సిలిండర్ కోసం ప్రజలు చేసుకున్న దరఖాస్తులను ఇంటింటికి తిరిగి పరిశీలించారు. అర్హులైన పేద ప్రజల అందరికీ న్యాయం జరిగేలా చూడాలన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యాసంస్థలకు సెలవు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని నాగోబా జాతర వైభవంగా జరుగుతోంది. ఇందులో భాగంగా సోమవారం జాతర నేపథ్యంలో నిర్వహించే ప్రజాదర్బార్‌ను పురస్కరించుకుని ఈనెల 12న సోమవారం ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థలకు ఈ సెలవు వర్తిస్తుందని తెలిపారు. ఆయా యాజమాన్యాలు ఈ విషయాన్ని గమనించాలన్నారు. తిరిగి మార్చి రెండో శనివారం రోజున పని దినంగా పరిగణించాలని పేర్కొన్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ఇంటర్మీడియట్ కాలేజీలకు సెలవు ఉండదని పేర్కొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్షలు

నవతెలంగాణ-ముథోల్

మండలంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షలు ప్రశాంతం జరిగాయి. ఉదయం నుండే ఆయా గ్రామాల నుంచి 5వ తరగతి ప్రవేశ పరీక్ష రాసేందుకు విద్యార్థులు తమ పోషకులతోని పరీక్షకేంద్రానికి చేరుకున్నారు. ఈ పరీక్ష కేంద్రంలో 456 విద్యార్థులకు గాను 431 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, 19 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్టు ప్రిన్సిపాల్ అమృతయ్య తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగాయి.

సాంప్రదాయ పూజల్లో మెస్రం వంశీయులు

- పెర్సాపేన్‌కు పూజలు
- భాన్ దేవతకు పూజలు



కోనేరు నుంచి కుండల్లో నీటిని తీసుకువస్తున్న మెస్రం ఆడపడుచులు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ప్రసిద్ధిగాంచిన కేస్లాపూర్ నాగోబాకు మెస్రం వంశీయులు సాంప్రదాయ బద్ధంగా పూజలు చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఆలయం వెనుకాల ఉన్న పెర్సాపేన్, భాన్ దేవతలకు సాంప్రదాయ పద్ధతిలో పూజలు నిర్వహించారు.

పెర్సాపేన్‌కు పూజలు...

ముందుగా వారి సాంప్రదాయ వాయిద్యాల మధ్య పెర్సాపేన్‌కు చేరుకున్నారు. అక్కడ సంస్కృతి, సాంప్రదాయం ప్రకారం తమల పాకును సమర్పించి, పాదాభివందనం చేశారు. దేవునికి నవధాన్యాలుతో కూడిన నైవేద్యాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలో పురుషులు మాత్రమే చేయడం ఆనవాయితీ.

భాన్ దేవతకు పూజలు...

మెస్రం ఆడపడుచులు కోనేరు నుంచి కుండల్లో తెచ్చిన నీటితో భాన్ దేవతను తయారు చేస్తారు. అనంతరం ఆ దేవతకు నైవేద్యాన్ని సమర్పిస్తారు. వాయిద్యాల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజలో మహిళల పాత్ర అధికంగా ఉంటోంది.

పోడు భూములకు పట్టాలివ్వాలి

జిల్లా తుడుం దెబ్బ జిల్లా కన్వీనర్ నైతం రమేష్

నాగోబా దర్బార్‌లో అధికారులు ఆదివాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారు. గిరిజన దర్బార్‌లో వారి సమస్యలైన పోడు భూములకు పట్టాలివ్వాలి. ఏజన్సీలో 1/70 చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి. పీసా చట్టంతో పాటు గిరిజనులకు గిరిజన బంధును అమలు చేయాలి. ఆదివాసీ గూడెల్లో మౌలిక సదుపాయాలైన విద్య, వైద్యం, తాగునీరు, రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.



జిల్లా ఆస్పత్రిగా మార్చేందుకు పాటుపడతా...!

- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

నవతెలంగాణ-భైంసా

భైంసా ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా మార్చేందుకు పాటుపడుతానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. ఆదివారం ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన డెవలప్‌మెంట్ కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ఆస్పత్రిలో మూడు ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేయడంతో పాటు, లాప్రోస్కోపిక్ అందుబాటులో ఉంచుతామన్నారు. మానవత్వంతో, వైద్యులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. కొత్తగా నియామకమైన ఏడుగురు డాక్టర్లకు సూచించారు. గత విషయాలు పక్కనబెట్టి, పేదలకు వైద్య సేవలు అందించడం లక్ష్యంగా ఆస్పత్రుల్లో 8 అవుట్ పేషెంట్ గదులు, ప్రయివేట్ ఆస్పత్రులకు దీటుగా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం నిధులు ఇవ్వకుంటే అవసరమైతే తన ఫండ్స్, దాతల సహకారంతో ఆస్పత్రిని అభివృద్ధి పరుస్తామన్నారు. రూ.43 లక్షలతో ఏరియా ఆస్పత్రిలో ఆక్సిజన్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. వైద్యులు ఆస్పత్రికి వచ్చిన రోగులను ప్రేమతో పలకరించాలని తెలిపారు. మానవత్వంతో వైద్య సేవలు చేయాలని వారికి సూచించారు. ఈ సందర్భంగా కొత్తగా నియామకమైన వైద్యులు శృతి, రజనీకాంత్, దయానందరెడ్డి, నరేష్, శ్రీకాంత్‌లను సన్మానించారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు దీప సోలంకే భీంరావు పటేల్, వైస్ చైర్మెన్ సాగరబాయి, రాజన్న, ఎంపీపీ అబ్దుల్ రజాక్, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కాశీనాథ్, వైద్యులు అనిల్ పటేల్, కైలాస్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అరవింద్ కుమార్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దాక్టర్లు

నవతెలంగాణ-బేల

మండలంలోని గూడ గ్రామంలో రానున్న వేసవికాలన్ని దృష్టిలో ఉంచుకొని శ్రీకృష్ణ క్రిటికల్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. ఈ శిబిరానికి వచ్చిన ప్రజలకు అనేక రకాలైన వ్యాధులకు వైద్యులు చికిత్సలు చేసి మందులు అందజేశారు. షుగర్, బీపీ, కడుపు నొప్పి, నడుము నొప్పి, కీళ్ల నొప్పులు, కిడ్నీ సమస్యలు సంతానం లేని వారికి ప్రత్యేక చికిత్స, నెలసరి సమస్యలు శరీరంలో గడ్డలు, ఒంటినొప్పులతో పాటు జ్వరాలు వంటి అనేక రకాల దీర్ఘకాలిక వ్యాధులకు వైద్యులు పరీక్షించి చికిత్సలు అందచేశారు. ఈ వైద్య శిబిరానికి సుమారు 200 మందికి పైగా హాజరై చికిత్సలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి మాట్లాడుతూ గూడ గ్రామంలో అనేక మంది దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. ప్రజలకు ఏదైనా చేయాలనే ఉద్యేశంతో శ్రీకృష్ణ క్రిటికల్ కేర్ హాస్పిటల్ వారి సహకారంతో మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇందులో పలు రకాల వ్యాధులకు ఓపికతో చికిత్సలు అందించిన వైద్యులు డాక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ దుర్గా గణేష్, డాక్టర్ రజిత క్రాంతిలు పాల్గొని ప్రజలకు వైద్యమందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గంభీర్ ఠాక్రే, ఆడానేశ్వర ఫౌండేషన్ చైర్మెన్ సతీష్ పవార్, కిసాన్ సెల్ బేల మండల అధ్యక్షుడు ఘన శ్యామ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొడే అవినాష్, మాజీ సర్పంచ్ తానుబా ఠాక్రే, ధైర్యవాన్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఠాక్రే విపిన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గంభీర్, ఉన్నారు.

బాల ప్రతిభా పురస్కారాలు ప్రదానం



నవతెలంగాణ-ఉట్నూర్

2021వ సంవత్సరంలోని నవంబరు 14 వ తేదీన ఉట్నూర్ సాహితీ వేదిక వారి ఆధ్వర్యంలో ఉట్నూరు విద్యార్థులు రచించిన కవిత్వ పరిమళాలు పుస్తకాన్ని ప్రచురించింది. డా.చింతోజు బ్రహ్మయ్య మెమోరియల్ బాలమణి బాల ప్రతిభా పురస్కారానికి కవిత్వ పరిమళాలు పుస్తకం ఎంపికైంది. ఈ సందర్భంగా ఆదివారం ఉసావే ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి ఉసావే గౌరవ అధ్యక్షులు రాథోడ్ భీంరావ్ మాట్లాడుతూ విద్యార్థులచే కవిత్వం రాయించడం వారికి పురస్కారాలు సైతం రావడం వెనుక ఉసావే కృషి ఉన్నతమైనదని ప్రశంసించారు. వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డా.మెస్రం మనోహర్ మాట్లాడుతూ సాహిత్యమనేది సమాజానికి చక్కని మార్గమని, సాహిత్యంతో సమసమాజాన్ని, నవసమాజాన్ని నిర్మించవచ్చునని కవిత్వ ఔన్నత్యాన్ని వర్ణించారు. పూర్వాధ్యక్షులు కట్టా లక్ష్మణాచారి పిల్లల అభిరుచి అభినందనీయమన్నారు. పూర్వాధ్యక్షులు రాథోడ్ శ్రావణ్ పిల్లలు ఇంకా చక్కని కవితలు రాస్తూ స్వీయపుస్తకం రాసేంతగా ఎదగగలరని అభినందిస్తూ ఆశీర్వదించారు. అనంతరం ఉసావే కవులు కవిత్వ పరిమళాలు పుస్తకానికి సంపాదకత్వం వహించిన ఉసావే అధ్యక్షులు కవనకోకిల జాదవ్ బంకట్ లాల్, ప్రధాన కార్యదర్శి ముంజం జ్ఞానేశ్వర్‌లతో పాటు సరస్వతీ జ్ఞాన విద్యాలయం విద్యార్థి నవనేశ్‌కు శాలువాతో బాలప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉసావే కవులు డా.ఇందల్ సింగ్ బంజారా, పవార్ వినోద్ కుమార్, పి.మాధవ్‌రావ్, గంగాసాగర్ పాల్గొన్నారు.

16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

- ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న



నవతెలంగాణ-నిర్మల్

ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త కార్మికుల సమ్మె గ్రామీణబంద్‌ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కే.రాజన్న అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో ఐఎఫ్‌టీయూ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శి ఆర్.రామలక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది సంవత్సరాలు పూర్తయినా, రైతాంగ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. దేశవ్యాప్తంగా జరిగే ఈ సమ్మె కార్యక్రమాన్ని రైతాంగం, కార్మికవర్గం, బడుగు బలహీన ప్రజలందరూ బంద్‌ను పాటించి, ఈ సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. కార్యకమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.గంగన్న, జిల్లా కోశాధికారి ఎండి.గఫూర్, జిల్లా కమిటీ నాయకులు కే.లక్ష్మి, గంగామణి, ఎస్.లక్ష్మి, ముత్తవ్వ, పోశెట్టి పాల్గొన్నారు.

సామాజిక సేవకుడికి సన్మానం



నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన సామాజికవేత్త ముంతాజ్‌ను, జిల్లా అటవీశాఖ అధికారి ప్రశాంత్ బాజీరావు పాటిల్ శాలువాతో సన్మానించారు. ఆదివారం ఇచ్చోడ మండలంలోని కేశవపట్నం గ్రామానికి వచ్చిన డీఎఫ్ఓ ముంతాజ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీఎఫ్ఓ మాట్లాడుతూ అటవీ పరిరక్షణలో ముంతాజ్ చేసిన సేవలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ పుండలిక్, ఎంపీటీసీ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదివిన 1993-1996 బ్యాచ్ పూర్వవిద్యార్థులు 28 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బీఎస్సీ, బీజెడ్‌సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం జిల్లా కేంద్రంలోని మయూరి ఇన్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాటి గుర్తులను, కళాశాలలో గడిపిన క్షణాలను, ఎన్నో మధురానుభూతులను గుర్తుచేసుకున్నారు. తమకు విద్యను అందించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థుల్లో ఒకరైనటువంటి మాజీ నిర్మల్ మున్సిపల్ చైర్మెన్ అప్పల గణేష్, ట్రాస్మా నిర్మల్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్, శ్రవణ్, శ్రీనివాస్, మిత్రబృందం పాల్గొన్నారు.

నాగోబాను దర్శించుకున్న కుస్రం నీలాదేవి

నవతెలంగాణ-సిరికొండ

ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ దేవాలయంలో ఆదివారం ఆదివాసుల, ఆరాధ్య దైవం నాగోబా దేవతను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యురాలు కుస్రం నీలాదేవి దర్శించుకున్నారు. ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం మెస్రం వంశీయులు నీలాదేవిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మెస్రం శేఖర్‌బాబు, పెందూర్ లక్ష్మణ్‌రావు, మాడవి జగన్ పాల్గొన్నారు.

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా



నవతెలంగాణ-దస్తురాబాద్

మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని 13 గ్రామ పంచాయతీలలో మంజూరైన సీసీ రోడ్లు, డ్రైనేజీలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని, రాష్ట్రాన్ని దోచుకున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలను తప్పకుండా అమలు చేస్తామని అన్నారు. ప్రతి గ్రామంలో ఎలాంటి సమస్యలు లేకుండా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దుర్గం మల్లేష్, మండల యూత్ అధ్యక్షులు గుండ నరేష్, సింగరి వెంకటేష్, తిప్పని రంజిత్, గాజుల రాజేందర్, చుంచు భూమన్న, మాదాసు అఖిల్, పుణ్య నాయక్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | ఫిబ్రవరి 12, 2024 | www.navatelangana.com

జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన వీటీజీ సెట్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



గిరిజన గురుకుల పాఠశాలలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి ప్రవేశం కోసం ఆదివారం జిల్లాలో నిర్వహించిన వీటీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు జిల్లా కోఆర్డినేటర్ బాలరాజు తెలిపారు. జిల్లాలో మొత్తం తొమ్మిది సెంటర్లు ఏర్పాటు చేయగా వీటిలో 2782 మందికి గాను 2367 మంది హాజరు కాగా 415 మంది గైర్హాజరైనట్లు వివరించారు. విద్యార్థుల హాజరు శాతం 85 శాతం ఉన్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనాథ్ సిఎస్‌గా ఏర్పాటు చేసిన సెంటర్‌ను ఆర్సిఓ స్వరూపరాణి తనఖీ చేశారు. విద్యార్థులకు ఇబ్బందులు కాకుండా చూడాలని సూచించారు.

ఎస్పీఎం గుర్తింపు ఎన్నికల నిర్వహనకు ఒత్తిడి తేవాలి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహనకు కార్మికశాఖ, యాజమాన్యంపై ఒత్తిడి తేవాలని కోరుతూ ఆదివారం సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం. సాయిబాబుకు ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ విషయంలో తన వంతుగా కృషి చేస్తానని ఈ సందర్భంగా సాయిబాబు హామీ ఇచ్చినట్టు ప్రజాసంఘాల నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయదేవ్, గొల్లపల్లి నాగేశ్వరరావు, బావుండ్లపెల్లి నర్సయ్య, అంబాల ఓదెలు, గడదాసు మల్లయ్య, నక్క మనోహర్, తాజుద్దీన్ పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లర్ల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో గంజాయి స్మగ్లింగ్ ఎక్కువగా జరుగుతుందని యువతను వాటి నుండి కాపాడి స్మగ్లర్లపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గోడిసెల కార్తీక్ కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువతకి గంజాయినీ అలవాటు చేసి గంజాయి స్మగ్లర్లు వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాలోని వాంకిడి, ఆసిఫాబాద్, తిర్యాని మండలాల్లో రాత్రిపూట విచ్చలవిడిగా గంజాయి స్మగ్లింగ్ నడుస్తుందని ఆరోపించారు. గంజాయి నివారణకు పోలీసులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి యువతను కాపాడి వారి భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గెడం టీకనంద్, జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు చాపిడి పురుషోత్తం పాల్గొన్నారు.

నిర్మాణ పనులను అడ్డుకున్న గ్రామస్తులు



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని ఎలుకపెల్లి గ్రామంలో అటవీ శాఖ అధికారులు చేపడుతున్న నిర్మాణ పనులను ఆదివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో అటవీ శాఖ అధికారులకు, గ్రామస్తులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అటవీ శాఖకు మంజూరైన గెస్ట్ హౌజ్ నిర్మాణం గ్రామ సమీపంలో స్మశానవాటిక పరిసరాల ప్రాంతాల్లో చేపడుతున్నారు. అయితే గతంలో కూడా అటవీ శాఖ పనులు చేపట్టగా గ్రామస్తులు అడ్డుకున్నారు. మరోసారి నిర్మాణ పనులను చేపట్టేందుకు వచ్చారు. గ్రామస్తులు అడ్డుకోవడంతో మళ్లీ పనులు అగిపోయాయి. అటవీ, రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహిస్తున్నారని, సర్వే పూర్తయ్యే వరకు వేచిచూడాలని అటవీ శాఖ అధికారులను గ్రామస్తులు కోరారు. అటవీ శాఖ ఇన్‌చార్జి రేంజ్ సుధాకర్‌ను సంప్రదించగా పై అధికారుల నుండి ఆదేశాల మేరకే నిర్మాణ పనులు చేపడుతున్నామని, అక్కడి నుంచి ఆదేశాలు వస్తే పనులు నిలిపివేస్తామన్నారు. అనంతరం సంఘటన స్థలానికి కాంగ్రెస్ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ పరిశీలించారు. ఈ విషయం జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిర్మాణ పనులను నిలిపివేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పెంచికల్‌పేట్ ఎస్సై చంద్రయ్య అటవీ అధికారులను, గ్రామస్తులను సముదాయించడంతో వారు వెనుదిగారు.

సబ్‌ప్లాన్‌కు నిధులు ఇవ్వకపోవడం అన్యాయం

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీ అభివృద్ధికి సంబంధించిన సబ్‌ప్లాన్‌కు నిధులు కేటాయించకపోవడం అన్యామని కుమురం భీం అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కోట సతీష్, సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు కామెర తిరుపతి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వంగా చెప్పుకుంటున్న కాంగ్రెస్ వెనుకబడిన ఎస్సీ, ఎస్టీల పట్ల నిర్లక్ష్యం వహించడం తగదని, బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి

నవతెలంగాణ-వాంకిడి

ఐటీడీఏ, పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ ద్వారా మంజూరైన రోడ్లు, వంతెనల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని జెడ్పీటీసీ అజయ్‌కుమార్ అన్నారు. మండలంలో బంబారా, గోండ్‌కొటార, పిప్పర్‌గొంది, మహగావ్, చొప్పన్‌గూడ, కిర్డీ, ఎనోళి, తమేళ, రాజీవ్‌నగర్ గ్రామాల్లో మంజూరైన రోడ్లు, వంతెనల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. మండలంలోని ఆయా గ్రామాల్లో రోడ్లు, వంతెనలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని రోడ్లను త్వరగా పూర్తిచేయాలని ఆయన కోరారు.

నేడు నాగోబా జాతర సందర్భంగా సెలవు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆదిలాబాద్ జిల్లాలో జరగనున్న ఆదివాసి జాతర నాగోబా సందర్భంగా సోమవారం జిల్లాలోని ప్రభుత్వ ప్రయివేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ బోర్కడ హేమంత్ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సెలవుకు బదులుగా మార్చ్ నెలలో వచ్చే రెండో శనివారం విద్యాసంస్థలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఇంటర్‌మీడియట్ విద్యా సంస్థలకు పరీక్షలు నడుస్తున్న నేపథ్యంలో సెలవు నుండి వాటిని మినహాయిస్తున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాలో ఎనిమిది మంది ఎంపీడీఓల బదిలీ

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో 8 మంది ఎంపీడీఓలను ఇతర జిల్లాలకు బదిలీ చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ అనిత రామచంద్రన్ ఆదివారం ఉత్తర్వులు విడుదల చేశారు. బదిలీ అయిన వారిలో వివిధ మండలాల ఎంపీడీవోలు సత్యనారాయణ సింగ్, శ్రీనివాస్, సత్యనారాయణ, మహేందర్, మధుసూదన్, రాజేశ్వర్, శశికళ, జె.ఆర్. ప్రసాద్ ఉన్నారు. వీరి స్థానంలో మంచిర్యాల జిల్లా నుండి ప్రవీణ్ కుమార్, వివి.వరలక్ష్మి, శంకరమ్మ, వేముల మల్లేష్, శ్రీనివాస్, సత్యనారాయణ, రాజేందర్, మహబూబ్ నగర్ నుండి కష్టారావులు జిల్లాకు రానున్నారు.

రాజంపేటపై కదలని అడుగు..!

- ఏడాదైనా పట్టించుకోని అధికారులు
- మార్కెట్ల ఆక్షన్ నిర్వహణపై సందిగ్ధం



ఆసిఫాబాద్ మున్సిపల్ కార్యాలయం



జూబ్లీ కూరగాయల మార్కెట్

నవతెలంగాణ- ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మున్సిపాలిటికల నెరవేరుస్తూ ఫిబ్రవరి ఒకటిన ఉత్తర్వులు విడుదల కావడం సంతోషంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం రాజంపేట పరిస్థితిపై సందిగ్ధం వీడటం లేదు. గత సంవత్సరం వర్షాకాల సమావేశాల్లో రాజంపేటను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు విడుదలైనప్పటికీ ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

రాజంపేట ఏర్పాటుపై వీడని సందిగ్ధం

గత సంవత్సరం రాజంపేట ను గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తూ జీవో విడుదలైనప్పటికీ నేటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. వార్డు మెంబర్లు, సరిహద్దుల ఏర్పాటు ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్లు ఉంది. అధికారులు దీనిపై పట్టింపులేని తనంతో వ్యవహరించడంతో రాజంపేటపై సందిగ్ధత కొనసాగుతోంది.

మార్కెట్ల ఆక్షన్ సాగేదెలా?

ప్రస్తుతం జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న జూబ్లీ మార్కెట్‌తో పాటు మటన్, చేపల మార్కెట్లు రాజంపేట పరిధిలో రానున్నాయి. ప్రతి సంవత్సరం మార్చి నెలలో మార్కెట్ ఆక్షన్ అధికారులు నిర్వహిస్తారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీకి అధికారులు లేకపోవడం, ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో అసలు ఆక్షన్ ప్రక్రియ ఎలా కొనసాగుతుందనేది ఇప్పుడు అనుమానంగా మారింది.

రాజంపేట ప్రజల సమస్యలు తీర్చేదెవరు

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేక అధికారుల నియామకం చేపట్టింది. ఆసిఫాబాద్‌లో ఇప్పటివరకు కొనసాగగా ఫిబ్రవరి ఒకటో తేదీన జిల్లా కేంద్రాన్ని మున్సిపాలిటీగా ప్రకటించడంతో కమిషనర్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పనులు కొనసాగుతున్నాయి. ఇదే సందర్భంలో రాజంపేట నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసినప్పటికీ దానికి సెక్రటరీ స్థాయి అధికారి లేరు. దీనితో గ్రామపంచాయతీకి చెందిన ప్రజల సమస్యలు ఎవరు పరిష్కరిస్తారనే అంశం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

రాజంపేటకు అధికారిని కేటాయించాలి

- రాజు, స్థానికుడు

ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఏర్పాటు చేసి రాజంపేటను పంచాయతీగా ఏర్పాటు చేయడం ఆహ్వానించదగిందే. అయినప్పటికీ దానికి ప్రత్యేక అధికారిని కేటాయించకపోవడంతో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి సెక్రటరీ స్థాయి అధికారిని కేటాయించాలని కోరుతున్నాము.

శివాజీ స్ఫూర్తితో పరిరక్షణకు పాటుపడాలి

- ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఛత్రపతి శివాజీ తన జాతిని, తన సామర్థ్యాన్ని కాపాడుకోవడానికి నాటి కాలంలో బ్రిటిష్‌తో పోరాటాలు చేసి రాజ్యాన్ని విస్తరించారని, నేటి యువత ఆయన ధైర్యసాహసాలను స్ఫూర్తిగా తీసుకొని ధర్మ పర్యవేక్షణకు పాటుపడాలని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. ఆదివారం మండలంలోని నవెగాం గ్రామంలో నూతనంగా ఏర్పాటుచేసిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తితో ధర్మ రక్షణకు పాటుపడాల్సిన అవసరముందన్నారు. హైందవ ధర్మ పరిరక్షణ కోసం ఆయన చేసిన పోరాటం చైతన్యం కలిగిస్తుందన్నారు. సిర్పూర్ మండలంలో అభివృద్ధికి నోచుకోని ప్రాంతాలను గుర్తించి, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను, ప్రతి గ్రామంలో రోడ్లు, రవాణా సౌకర్యాన్ని కల్పించడానికి కృషి చేసి ప్రజలు చూపిన అభిమానాన్ని ఇలాగే కొనసాగించేలా అభివృద్ధికి పాటుపడుతానన్నారు. అలాగే ఆరె కులస్తుల సంక్షేమం, అభివృద్ధి కోసం పాటుపడుతానని, వారికి కేంద్ర ప్రభుత్వం త్వరలోనే ఓబీసీ సర్టిఫికేట్ ఇవ్వనుందని అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో కూడా పెద్దఎత్తున శివాజీ మహారాజ్ విగ్రహాన్ని నెలకొల్పుతానని, అలాగే సిర్పూర్ మండలకేంద్రంలో శివాజీ విగ్రహంతో పాటు ఆరె కులస్తుల భవనానికి స్థలం, భవనం నిర్మించడానికి తన వంతు కృషి చేస్తామని భరోసా హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరెకుల సంఘం జిల్లా నాయకులు, మండల నాయకులు, తాలుకా నాయకులు పాల్గొన్నారు.

సాంకేతికతతో కూడిన సృజనాత్మకతను అలవర్చుకోవాలి

- బెల్లంపల్లి ఏరియా జీఎం డి రవిప్రసాద్
- ఘనంగా సింగరేణి పాఠశాల 41వ వార్షికోత్సవ వేడుకలు



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న జీఎం రవిప్రసాద్

నవతెలంగాణ-రెబ్బెన

విద్యార్థులు మారుతున్న కాలనికి అనుగుణంగా నూతన ఆవిష్కరణలకు తగినట్టుగా సాంకేతికత నైపుణ్యాలను అందిపుచ్చుకోవాలని బెల్లంపల్లి ఏరియా జీఎం డి.రవిప్రసాద్ అన్నారు. ఆదివారం గోలేటి సింగరేణి ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 41వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు, క్రీడల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. సింగరేణి పాఠశాలలోనే తమ చదువులను సాగించాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. విద్యార్థులు చదువుతో పాటు మంచి క్రమశిక్షణ అలవరుచుకోవాలన్నారు. క్రీడల్లో విద్యార్థులు గొప్పగా రాణిస్తున్నారని, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో సింగరేణి పాఠశాల విద్యార్థులు ఎంపిక కావడం అభినందనీయమని, విద్యార్థులకు క్రీడల్లో మంచి నైపుణ్యాలను అందిస్తున్న పీటీ భాస్కర్‌ను అభినందించారు. స్కూల్ చలే హమ్, అసైదులా, శాస్త్రీయ నృత్యం, చెట్లను కాపాడే విధంగా పిల్లలు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఫోన్‌తో మంచి కంటే చెడే ఎక్కువగా ఉంటుందన్న సందేశంతో చేసిన హాస్య నాటకం ఆలోచింపచేసింది. ఈ వేడుకలకు వచ్చిన అతిథులకు స్వాగతం పలిలుతూ చిన్నపిల్లలు పాడిన పాట, బంజార పాటతో పాటు జానపద పాటలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సంతోష్, ఏఐటీయూసీ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, పాఠశాల కరస్పాండెంట్ రెడ్డిమల్ల తిరుపతి, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహెరా, ఉపాధ్యాయులు ఆర్ల రెడ్డి, సమత, మానస, స్వరూప, సిబ్బంది పాల్గొన్నారు.

దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న మోడీ



పోస్టర్లను విడుదల చేస్తున్న బోగె ఉపేందర్, కార్మికులు

నవతెలంగాణ-రెబ్బెన

దేశ సంపదను కార్పొరేట్లకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం దోచిపెడుతుందని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఆదివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో తెలంగాణ ఫారెస్టు నర్సరీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఫారెస్టు నర్సరీలో వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 సంవత్సరాలు గడిచిందని, ఈ కాలంలో కార్మికులు, కర్షకులకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో విఫలమైందన్నారు. అసంఘటిత కార్మిక వర్గానికి, సామాజిక భద్రత చట్టాన్ని తీసుకురావాలని, ప్రభుత్వ రంగ సంస్థల్లో ప్రయివేటీకరణను ఆపాలని డిమాండ్ చేశారు. 16న చేపడుతున్న దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఫారెస్టు నర్సరీ వర్కర్స్ యూనియన్ నాయకులు టి.దివాకర్, ప్రధాన కార్యదర్శి సంఘమిత్ర, నాయకులు సతీష్, ప్రియాంక, బాపు పాల్గొన్నారు.

రేపటి జిల్లా విద్యా సదస్సు విజయవంతం చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావ్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 13వ తేదీన నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ జిల్లా విద్యా సదస్సు విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి సోడియం ఇందురావు కోరారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు స్థానిక చెక్ పోస్ట్ ఎదురుగా గల ఎస్ఎం గార్డెన్‌లో జిల్లా విద్యాసదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య, గౌరవ అతిథులుగా డీఈఓ పార్సి అశోక్, డీటీడీఓ రమాదేవి హాజరవుతారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యారంగ సవాళ్లు, పరిష్కారం దిశగా చర్చ జరుగుతుందన్నారు. విద్యా సదస్సు అనంతరం ఉపాధ్యాయ సమస్యలు వాటి పరిష్కారం, పోరాటాలు, సంఘ నిర్మాణం, భవిష్యత్తు కర్తవ్యాలు నిర్ణయించడం జరుగుతుందని, దీనికోసం సంఘ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ యాజమాన్యాల గురుకుల, కేజీబీవీ, యూఆర్ఎస్, ఆశ్రమ, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులు, సంఘ బాధ్యులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దూలం ఎల్లయ్య, హేమంత్ సిండే, తంగడిపల్లి రమేష్, కాంపెల్లి ఉషన్న నవీన్ కుమార్, బాధిరావు, జాడి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని మొగవెల్లి గ్రామంలో నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు బెజ్జూర్ ఎస్సై విక్రం తెలిపారు. ఆదివారం మొగవెల్లి గ్రామంలో ఒకరి ఇంట్లో బియ్యం నిల్వ ఉన్నట్టు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఇందులో నిల్వ ఉంచిన 20 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు. మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఈ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు. బెజ్జూర్‌కు చెందిన నౌషద్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఘనంగా వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్


వాసవి మాత ఆత్మార్పణ దినోత్సవం జిల్లా కేంద్రంలోని వాసవి మాత ఆలయంలో వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం వాసవి మాతకు పంచామృతాలతో అభిషేకం చేసి, వాసవి మాత పారాయణం, కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ తరపున భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షులు కొలిపాక శంకర్, ప్రధాన కార్యదర్శి తాటిపల్లి ఆదిత్య, కోశాధికారి చిలువేరి శ్రీధర్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సిర్పూర్(యు), లింగాపూర్ ఎంపీడీఓల బదిలీ

నవతెలంగాణ-జైనూర్

సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల్లో కొన్ని సంవత్సరాల నుండి మండల అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహిస్తున్న అధికారులను ఎన్నికల సందర్భంగా బదిలీ చేస్తూ ఆదివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సిర్పూర్(యు) మండలంలో కొన్ని సంవత్సరాల నుండి ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందిస్తూ ఎన్నో మంచి సేవలందిస్తున్న ఎంపీడీఓ మధుసూధన్‌తో పాటు నూతనంగా ఏర్పడిన లింగాపూర్ మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న జేపీ.ప్రసాద్ మంచిర్యాల జిల్లాకు బదిలీ అయ్యారు. నూతనంగా ఏర్పడిన లింగాపూర్ మండలంలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి గణతంత్ర దినోత్సవం రోజున ఉత్తమ సేవకు గాను ప్రశంసపత్రాలు అందుకున్నారు.

రాష్ట్ర ప్రథమ ర్యాంకర్‌కు సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

టీఎస్పీఎస్సీ ప్రకటించిన గ్రూప్-4 ఫలితాల్లో రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన శ్రీరామ్ శివకృష్ణను ఆదివారం పలువురు సన్మానించారు. పదవ తరగతి వరకు స్థానిక శిశుమందిర్‌లో విద్యను అభ్యసించిన వారి తల్లిదండ్రులను కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటికే ఉద్యోగం సాధించిన శివకృష్ణ రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం సాధించడం జిల్లాకే కాకుండా పాఠశాలకు కూడా గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మెన్ చిలువేరు వెంకన్న, సభ్యులు కృష్ణమూర్తి, వెంకన్న, కృష్ణమాచార్యులు, సంతోష్, హరిప్రియ, వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కోటేశ్వర్ పాల్గొన్నారు.

శివకృష్ణను సన్మానించిన శ్యాంనాయక్

రాష్ట్ర ప్రథమ ర్యాంకు సాధించిన శివకృష్ణను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విద్యాభివృద్ధి కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. శివకృష్ణ మరింత మందికి ఆదర్శప్రాయంగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్, శశి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
సోమవారం | ఫిబ్రవరి 12, 2024 | www.navatelangana.com

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

ఆదిలాబాద్‌టౌన్ : 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతిలో గురుకులాల్లో ప్రవేశం కోసం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఉమ్మడి జిల్లాలో 8 వేల 844 మంది విద్యార్థులకు గాను 25 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ లో 2727 మంది విద్యార్థుల కోసం 8 కేంద్రాలను ఏర్పాటు చేసి మౌళిక వసతులను కల్పించారు. ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష కొనసాగింది. ఆయా కేంద్రాల వద్ద విద్యార్థులు తమ హాల్ టికెట్లను సరిచూసుకున్నారు. పరీక్ష సమయం కంటే అర గంట ముందే విద్యార్థులు కేంద్రాలకు చేరుకోగా సిబ్బంది వారిని పరిశీలించిలోనికి అనుమతించారు. కాగా 2727 మంది దరఖాస్తు చేసుకోగా బాలురు 1277మంది, బాలికలు 1351మంది, మొత్తం 2628 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్సీఓ స్వరూపారాణి తెలిపారు. దీంతో 97 హాజరు శాతం నమోదయిందన్నారు. ఇదిలా ఉండగా ఆదిలాబాద్‌లోని సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకులాల కేంద్రాలను జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలాదేవి సందర్శించారు. ఈ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయకర్త ఎస్. శ్రీనివాస్ తెలిపారు.

నిరంతర సాధనతో క్రీడా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరంతర సాధనతో క్రీడా నైపుణ్యాలను మెరుగు పరుచుకోవాలని ఎంఐఎం ఎమ్మెల్సీ మిర్జా రియాజ్ ఉల్ హసన్ అన్నారు. పట్టణంలోని డైట్ మైదానంలో ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సలర్ ఏ మిలాత్ ఇంటర్ స్టేట్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగియగా ఆయన పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్ హోప్ క్రికెట్ క్లబ్ ఆదిలాబాద్, కలీం లెవెన్ జట్ల మధ్య జరిగింది. కలీం ఎలెవన్ జట్టు విజయం సాధించి టోర్నీని కైవసం చేసుకుంది. మ్యాచ్‌ను తిలకించేందుకు భారీ సంఖ్యలో క్రీడాభిమానులు తరలివచ్చారు. వారి చప్పట్లు, కేరింతలతో డైట్ మైదాన ప్రాంతం మారుమోగింది. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేత జట్టుకు నగదు బహుమతి రూ. రెండు లక్షలు, రన్నర్ అప్ జట్టుకు రూ. లక్ష నగదు బహుమతి రూ.లక్షను ఎమ్మెల్సీ అందచేశారు. టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందించారు.

గ్రామీణ ప్రాంత అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్

నవతెలంగాణ-దహెగాం

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో రూ.90 లక్షల ఎన్ఆర్ఈజీయస్ నిధులతో సీసీ రోడ్ల పనులను స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ పాలనతో విసిగిపోయిన ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంలో న్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో వివిధ పనుల నిమిత్తం రూ.10 కోట్ల నిధులు మంజూరయ్యాయని, రానున్న రోజుల్లో మరిన్ని నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. అధికారులు కూడా ప్రజలకు అవసరమైన సేవలు అందించడానికి ఎల్లవేళల అందుబాటులో ఉండి పథకాలను ప్రజలకు చేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎల్క మోహన్, గందె వెంకటేశ్, తోగేష్, రమేష్, ప్రశాంత్, శ్రీనివాస్, రాజు పాల్గొన్నారు.

బెజ్జూరు : మండల కేంద్రంలో ఆదివారం సిర్పూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ రూ.55 లక్షలతో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటుందన్నారు. గ్రామాల్లో మౌళిక వసతుల కల్పన కోసం విడతలుగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం మారుమూల గ్రామాల అభివృద్ధికి ఎలాంటి చొరవ చూపకపోవడంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ మారుమూల గ్రామాలకు రోడ్లు, వంతెనలు తదితర మౌళిక వసతుల ఏర్పాటుకు కృషి చేస్తుందన్నారు. అనంతరం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుష్పలత, సిర్పూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాచకొండ శ్రీవర్ధన్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బూస శంకర్, నాయకులు అకీమ్, హన్మంతు, శైలేష్, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : పేదల సంక్షేమమే లక్ష్యంగా పార్టీ పని చేస్తుందని కాంగ్రెస్ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలో పలు సీసీ రోడ్ల నిర్మాణ అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. పెద్దబండ గ్రామంలో సీసీ రోడ్డు, పారిగాం తదితర గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. అనంతరం భూపాలపట్నం, పెద్దబండ గ్రామాలకు చెందిన యువకులు కాంగ్రెస్ సిద్ధాంతాలకు ఆకర్షితులై భారీ సంఖ్యలో పార్టీలో చేరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జిల్లా, మండల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయడం జరిగిందని, దానిలో సిర్పూర్ మండలంలో పలు అభివృద్ధి పనులకు రూ.65 లక్షలు మంజూరుచేసిందని తెలిపారు. పేదల సంక్షేమం కోసం వారిని ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చేయడానికి కాంగ్రెస్ నాటి నుండి నేటి వరకు అదే సిద్ధాంతంతో పనిచేస్తుందని, పదేండ్ల నుండి తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందని, దీనిని గుర్తించి రాష్ట్ర ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం కట్టబెట్టారని, ప్రజలు దేనినైతే కోరారో వారి కలలను సఫలీకృతం చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చౌదరి తిరుపతి, ఉపాధ్యక్షుడు లెండుగురె శంకర్, కోశాధికారి ముగిద్‌హైమద్, కార్యదర్శి గొమాసె తిరుపతి, సోషల్ మీడియా ఇన్‌చార్జి మహేందర్, కార్యకర్తలు పాల్గొన్నారు.



దహెగాంలో కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభిస్తున్న రావి శ్రీనివాస్



బెజ్జూర్‌లో భూమి పూజ చేసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న రావి శ్రీనివాస్



సిర్పూర్(టి)లో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న యువత

ఘనంగా తరోడాలో మహాలక్ష్మీ విగ్రహ ప్రతిష్టాపన



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని తరోడ గ్రామంలో మహాలక్ష్మి పోచమ్మ ఆలయ పున:ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం వేదపండితుల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ పాల్గొని పూజలు చేశారు. గ్రామస్తులు ఎమ్మెల్యేకు నాయకులకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆలయాల అభివృద్ధికి సహాయ శక్తుల కృషి చేస్తానని అన్నారు. భక్తి భావంతోనే గ్రామాల్లో ఐక్యత భావం పెంపొందుతుందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ లక్ష్మినర్స గౌడ్, ఎంపీటీసీ గంగాధర్, బాసర జెడ్పీటీసీ వసంత రమేష్, మాజీ సర్పంచ్ రామచందర్, నాయకులు రవిగౌడ్, సాయిలు, శ్రీధర్ పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుడు ఆత్మహత్య యత్నం

నవతెలంగాణ-నస్పూర్

ఏఐటీయూసీ నాయకుల వల్ల సింగరేణి కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు బాధితుడు కొట్టె వెంకటేష్ పేర్కొన్నాడు. ఆదివారం ప్రయివేటు ఆస్పత్రిలో నవతెలంగాణ విలేఖరితో బాధితుడు తెలిపారు. తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఆర్పీ-1 గనిలో ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్లో జనరల్ మజ్దూర్‌గా పనిచేస్తున్న వెంకటేష్‌ను ఏఐటీయూసీ నాయకుల ఒత్తిడి వల్ల యాజమాన్యం జనరల్ షిఫ్ట్ నుంచి షిఫ్టులకు మార్చిందని పేర్కొన్నారు. తనకంటే జూనియర్లు నలుగురు ఉండగా తనను మార్చడాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్తే స్పందించలేదని, దాంతో మనస్థాపం చెంది ఆదివారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆర్గనైజింగ్ సెక్రటరీ కస్తూరి చంద్రశేఖర్, ఎస్ఆర్పీ-1 ఫిట్ కార్యదర్శి తొడే సుధాకర్, ఐఎన్టీయూసీ నాయకులు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ నాయకులు మాట్లాడుతూ ఏఐటీయూసీ నాయకుల వల్ల కార్మికుడు ఆత్మహత్య యత్నం చేసుకున్నాడని ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గెలిచిన యూనియన్ నాయకుల అండదండలతో అధికారులు కార్మికులను ఇబ్బందులకు గురి చేయడం వల్లే వెంకటేష్ అనే కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడని సీఐటీయూ నాయకులు తెలిపారు. గుర్తింపు సంఘం నాయకులు కార్మికుల సంక్షేమం కోసం పనిచేయాలని, యాజమాన్యంతో కలిసి కార్మికులను ఇబ్బందులకు గురి చేయవద్దని, జీఎం దృష్టికి తీసుకు వెళ్తామని పేర్కొన్నారు.

అసత్యపు ఆరోపణలు సరికాదు

గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులపై ఐఎన్టీయూసీ నాయకులు చేస్తున్న అసత్యపు ప్రచారాన్ని ఖండిస్తున్నట్లు శ్రీరాంపూర్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య అన్నారు. ఆదివారం నరసయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్పీ-1 గని ఇప్పటివరకు 73 శాతం మాత్రమే ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించిందని, 100 శాతం ఉత్పత్తి సాధించాలని సూచన మేరకు ఇంజనీరింగ్ డిపార్టెంట్లలో జనరల్ మజ్దూర్ కార్మికులు 15 మందిని షిఫ్టులలో వేశారని పేర్కొన్నారు. అందులో భాగంగానే వెంకటేష్ అనే కార్మికుని షిఫ్టలో వేయడం జరిగిందని, దానికి ఏఐటీయూసీకి ఎలాంటి సంబంధం లేదని, ఐఎన్టీయూసీ నాయకులు అసత్యపు ప్రచారాన్ని మానుకోవాలని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన ప్రవేశ పరీక్ష



నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘీక సంక్షేమ ఉమ్మడి గురుకులాల్లో ఐదో తరగతి ప్రవేశ కోసం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆదివారం 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఐదో తరగతి ప్రవేశ పరీక్షను తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలుర పాఠశాలలో 336 మంది, తెలంగాణ సాంఘీక సంక్షేమ బాలికల పాఠశాలలో 336 మంది, తెలంగాణ సాంఘీక సంక్షేమ కాగజ్‌నగర్ బాలికల పాఠశాలలో 240 మంది మొత్తం మూడు కేంద్రాల్లో 912 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 554 మంది విద్యార్థులు హాజరు కాగా 58 మంది విద్యార్థులు గైర్హాజరైనట్టు జిల్లా సమన్వయ అధికారి పోలోజు బాలరాజు తెలిపారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలను రాష్ట్ర కార్యాలయ అధికారిణి మంగ పర్యవేక్షించారు.

అవకాశమిస్తే ఎంపీ స్థానానికి పోటీ చేస్తా



నవతెలంగాణ-బేల

అధిష్టానం అవకామిస్తే ఎంపీ స్థానానికి ఆదిలాబాద్ నుంచి పోటీ చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకురాలు రేఖా శ్యాంనాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల ముఖ్య నాయకులను ఆమే కలిశారు. ఈ సందర్భంగా మండలంలో కాంగ్రెస్ పరిస్థితుల గురించి మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ గుండావార్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాబోయే ఆదిలాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్టానం అవకాశమిస్తే ఎంపీగా పోటీ చేస్తానని పేర్కొన్నారు. కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం వస్తుందని ప్రజలకు క్షేత్రస్థాయిలో వివరించాలని కార్యకర్తలకు సూచించారు. అధిష్టానం తీసుకునే నిర్ణయంపై తన పోటీ ఆధారపడి ఉంటుందని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకోని సీఎం రేవంత్‌రెడ్డికి బహుమతిగా ఇవ్వాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మెన్ వామన్ వాంఖడే, గీమ్మ సంతోష్, ఎంపీటీసీ నగేష్ రెడ్డి, అంకత్ రాజన్న, శంకర్ భోక్రే, అవినాష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా విద్యారంగానికి తీవ్ర అన్యాయం చేసిందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆత్రం నగేష్ ఆదివారం ఒక ప్రకటనలో అభిప్రాయం వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.8శాతం మాత్రమే కేటాయించింది. అంటే విద్యారంగానికి రూ.21,389 కోట్ల కేటాయించింది. గత బడ్జెట్‌తో పోల్చినప్పుడు కేవలం 2,296 కోట్లు విద్యారంగానికి పెరిగినట్టు ఉన్నా మొత్తం బడ్జెట్ పోల్చినప్పుడు పెరిగిందని పేర్కొన్నారు. గత విద్యారంగ బడ్జెట్‌తో పోల్చినప్పుడు కేవలం 1.31 శాతం మాత్రమే పెంచారన్నారు. ఈ నిధులతో ప్రస్తుతం ప్రభుత్వ విద్యయే మాత్రం అభివృద్ధి కాదని ఎస్ఎఫ్ఐ భావిస్తోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పెట్టినట్టు ప్రతి మండలంలో తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని చెప్పి కేటాయించింది. రూ.500 కోట్ల మాత్రమేనన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనలో యూనివర్సిటీలు దెబ్బతిన్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మెస్, భవనాలు, ఖాళీల భర్తీ, మౌళిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారని పేర్కొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

- ఎంపీ సోయం బాపురావు
- ముగిసిన జై జంగో జై లింగో దీక్ష



అలయంలో పూజలు చేస్తున్న ఎంపీ సోయం బాపురావ్

నవతెలంగాణ-జైనూర్

నేటి సమాజంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యుడు సోయం బాపురావు అన్నారు. ఆదివారం మండలంలోని జంగాం గ్రామంలో జై జంగో జై లింగో దీక్ష విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముందుండాలని సూచించారు. నేటి యుగంలో సమాజంలో యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఆదివాసులు పవిత్రమైన దేవస్థానంగా భావించే జై జంగో జై లింగో దీక్ష అని అన్నారు. జై జంగో జై లింగో దీక్షలో ఆదివాసీ యువత, మహిళలు ఎంతోమంది 41 రోజుల నుండి దీక్షలో పాల్గొన్నారని అభినందించారు. ఆదివాసులు అన్ని రంగాల్లో ముందుండాలంటే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో కూడా ముందుండాలన్నారు. జై జంగో జై లింగో దీక్ష చేపడుతున్నప్పటీ నుండి ఆదివాసీ సమాజంలో ఎన్నో మార్పులు వచ్చాయని కొనియాడారు. అనంతరం 41 రోజుల నుండి దీక్ష చేపడుతున్న వారు జై జంగో జై లింగో పీఠాధిపతి కుమ్రా భగవంత్‌రావుతో కలిసి ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయలతో దీక్షను విరమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మెన్ కనక యాదవరావు, ఉపాధ్యాయులు కొట్నాక మోపత్‌రావు, ఆత్రం దత్తు, ఎంపీటీసీ కుమ్రా భగవంత్‌రావు, ఆదివాసీ సంఘాల నాయకులు బాపురావు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

నవతెలంగాణ-ముధోల్

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి తన వంతుగా పాటుపడతానని ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ అన్నారు. ఆదివారం ముధోల్ నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సభ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంఘ భవనానికి నిధులు మంజూరు చేయనున్నట్టు తెలిపారు. అదేవిధంగా బాసరలో గెస్ట్ హౌస్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఉద్యోగులు కోరగా ఈ విషయాన్ని ప్రభుత్వం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి స్థలమిచ్చేందుకు పాటుపడతానన్నారు. గత తొమ్మిది సంవత్సరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో అన్ని రంగాల వారికి అన్యాయం జరిగిందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో తన వాణిని వినిపిస్తానన్నారు. రిటైర్డ్ ఉద్యోగులు శేష జీవితాన్ని ఆనందమయంగా గడపాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు ఎంసి లింగన్న, ముధోల్ అధ్యక్షులు మోహన్ రెడ్డి, బాసర జెడ్పీటీసీ వసంత, బాసర ఎంపీపీ విశ్వనాథ్ పటేల్, ఉద్యోగ సంఘం స్థానిక బాధ్యులు, రిటైర్డ్ ఉద్యోగులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ముధోల్ మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో రూ.5లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిమ్మ పోతన్న, దత్తత్రి, నర్సాగౌడ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



రిబ్బన్ కట్ చేసి టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మెన్ ప్రేమేందర్

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడల ద్వారా స్నేహానుబంధాలను పెంపొందించుకోవాలని మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం మండలంలోని తంతోలి గ్రామంలో జోగు ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ క్రీడా పోటీలను మున్సిపల్ చైర్మెన్ జోగు ప్రేమందర్ స్థానిక నాయకులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అంతకు ముందు తంతోలీ గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే క్రీడాకారులను పరిచయం చేసుకొని వారికి అభినందనలు తెలియజేశారు. టాస్ వేసి చైర్మెన్ క్రికెట్ ఆడి క్రీడాకారులకు స్ఫూర్తినిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ క్రీడాల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. గెలుపోటములు సహజమని ప్రతి క్రీడాకారుడు స్నేహభావంతో క్రీడలు ఆడాలన్నారు. జోగు ఫౌండేషన్ తరపున గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసేలా టోర్నమెంట్‌లతో పాటు క్రీడాకారులను ప్రోత్సహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మెన్ మెట్టు ప్రలాద్, కుమ్రా రాజు, పరమేశ్వర్, రాము, కేకే కృష్ణ పాల్గొన్నారు.

ఎన్ని కేసులు పెట్టినా.. పోరాటం కొనసాగుతుంది

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్



నవతెలంగాణ-జైపూర్

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలన్ని నెరవేరే వరకు తన పోరాటం కొనసాగుతుందని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌పై నమోదైన కేసుకు సంబంధించి విచారణకు హాజరు కావాలని పోలీసులు నోటీసు అందజేశారు. ఈ మేరకు స్పందించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ కేసులకు భయపడేది లేదని, ఎన్ని కేసులు పెట్టినా ప్రజల కోసం పోరాటం కొనసాగుతూనే ఉంటుందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై అట్రసిటీ కేసు

చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చిత్ర పటానికి చెప్పుల మాల వేసి ర్యాలీ చేపట్టిన కాంగ్రెస్ నాయకులు దళితులను అవమానపర్చారని వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు పెట్టాలని ఫిర్యాదు చేసినట్టు జడ్పీటీసీ మేడి సునిత భర్త తిరుపతి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి పట్ల అనుచిత వాఖ్యలు చేయడంతో చెప్పు చూపిస్తూ మంచిర్యాల బీఆర్ఎస్ సభలో దళిత నాయకుడైన సుమన్ వ్యవహరించిన తీరు తప్పు పట్టినప్పుడు ఇక్కడ కాంగ్రెస్ అగ్రకులాల వారు సుమన్ చిత్ర పటానికి చెప్పుల దండ వేయడం కూడ తప్పుగా భావించాలని డిమాండ్ చేశారు. ఈ సంఘటనలో ప్రధానంగా వ్యవహరించిన అగ్ర కులాలకు చెందిన రిక్కుల శ్రీనివాస్ రెడ్డి, బేతు తిరుపతి రెడ్డి, జైనోద్దీన్, చల్ల విశ్వంబర్ రెడ్డి, ఎండీ ఫయాజ్, గుడెల్లి శ్రీనివాస్ రెడ్డిలపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి దళితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఆస్తుల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ

ఆర్జీ-2 ఏరియా సెక్యూరిటీ డిస్ట్రిభూషన్ పాయింట్ నందు సెక్యూరిటీ సిబ్బందితో ఏరియా సీనియర్ సెక్యూరిటీ అధికారి షరీఫ్ మహమ్మద్ ఆదివారం సమావేశం నిర్వహించారు. కంపెనీ ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది తమకు కేటాయించిన పోస్టులలో అప్రమత్తంగా ఉండాలని, చెక్ పోస్టుల వద్ద కోల్ ట్రాన్స్‌పోర్ట్, సీఎస్పీల వద్ద, ఓపెన్ కాస్ట్ గనుల వద్ద సెక్యూరిటీ సిబ్బంది జాగ్రత్తగా లేకపోతే దాని ప్రభావం ఉత్పత్తి, ఉత్పాదకత,రవాణాపై పడే అవకాశం ఉంటుందని వారు అన్నారు. ఈ సమావేశంలో సీనియర్ ఇన్స్పెక్టర్ లక్ష్మీరాజం, జూనియర్ ఇన్స్పెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న సెక్యూరిటీ అధికారులు

యాదగిరి, జమేదార్ మజీద్, సెక్యూరిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జూలపల్లి



జూలపల్లి మండల కేంద్రంలో ఆదివారం రోజున ఆటో యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. ఆటో యూనియన్ అధ్యక్షుడిగా గుంటి సదయ్య, ఉపాధ్యక్షుడు సిలివేరి రాజేశం, క్యాషియర్ నేరువట్ల మహేందర్, ప్రధాన కార్యదర్శి కుషి మహేష్, సలహాదారుడు ఎండీ అజీజ్ ఎనుకున్నారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పొత్కపల్లి ఎస్ఐ శ్రీధర్ జూలపల్లికి బదిలీ

నవతెలంగాణ-ఓదెల

రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎస్ఐల బదిలీల్లో భాగంగా పొత్కపల్లి పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న ఎస్ఐ ఎన్ శ్రీధర్ జూలపల్లికి బదిలీ కాగా, సుల్తానాబాద్‌లో ఎస్ఐ -2గా పని చేస్తున్న అశోక రెడ్డి పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌కి బదిలీ అయ్యారు.

రమేష్ ఆచార్యకు పురోహితరత్న జాతీయ అవార్డు



పురోహితరత్న అవార్డును మామిడిపల్లి సరేష్ ఆచార్యులు కు అందిస్తున్న ట్రస్ట్ చైర్మన్‌లు

నవతెలంగాణ-ధర్మారం

మండలంలోని రామయ్యపల్లి గ్రామ అభయాంజనేయ స్వామి దేవాలయం పురోహితులు మామిడిపెల్లి నరేష్ ఆచార్యులుకు ఆంధ్రప్రదేశ్ బుక్ఆఫ్‌రికార్డ్ అసోసియేటెడ్ విత్ తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పురోహిత రత్న జాతీయ అవార్డును ఆదివారం రోజు వ్యవస్థాపక చైర్మన్ మాచవరం గౌరీశంకర్ అందజేశారు. ఈ సందర్భంగా మామిడిపల్లి నరేష్ ఆచార్యులు మాట్లాడుతూ తన పురోహిత సేవలు గుర్తించి తనకు పురోహితరత్న అవార్డును అందజేసిన ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్‌కు మాచవరం గౌరీ శంకర్ కు, బుక్ ఆఫ్ రికార్డ్స్ అసోసియేషన్ చైర్మన్ రాజేశ్వరి, కో చైర్మన్ శ్రీనివాస్ కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆత్మరక్షణకు, ఆరోగ్యానికి కరాటే చాలా అవసరం

కరాటే శిక్షకులు,కాయి స్పోర్ట్స్ కమిషన్ కావేటి సమ్మయ్య



విద్యార్థులకు సర్టిఫికెట్స్ బెల్టులు అందజేస్తున్న మాస్టర్స్

నవతెలంగాణ-మంథని

ఆత్మ రక్షణకు ఆరోగ్యానికి కరాటే ఎంతో ఉపయోగపడుతుందని కరాటే శిక్షకులు కాయ్ స్పోర్ట్స్ కమిషన్ కావటి. సమ్మయ్య అన్నారు. ఆదివారం మంథనిలో జపాన్ షిటోరియు కరాటే అకాడమీ ఆధ్వర్యంలో కరాటే బెల్ట్ పరీక్షలు నిర్వహించారు.ఈ బెల్ట్ పరీక్షలలో దాదాపు40 మంది విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.ఈ బెల్ట్ పరీక్షలలో ఎల్లో బెల్ట్, ఆరెంజ్ బెల్ట్,గ్రీన్ బెల్ట్, బ్లూ బెల్ట్, బ్రౌన్ బెల్టు, బ్లాక్ బెల్ట్ సాధించారు.ఈ బెల్ట్ పరీక్షలకు చీఫ్ ఎగ్జామినేటర్ టెక్నికల్ డైరెక్టర్‌గా ఈ పరీక్షలలో పాలకుర్తి పాపయ్య కాయ్ స్పోర్ట్స్ కమిషన్ చైర్మన్ వ్యవహార కర్తగా వ్యవహరించి అర్హత సాధించిన విద్యార్థిని,విద్యార్థులకు బెల్టులు,సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ బెల్ట్ పరీక్షలలో మెట్టు హాసిని,బ్లాక్ బెల్ట్ సెకండ్ డిగ్రీ ఎండితేజ్,బ్లాక్ బెల్ట్ పి.భవాని,బ్రౌన్ బెల్ట్ సాధించారు. ఈ కార్యక్రమంలో జపాన్ షిటోరియు కరాటే అకాడమీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి సమ్మయ్య,ఇన్స్పెక్టర్ నాగేల్లి రాకేష్,కావేటి శివ, గణేష్,పి.తేజ,శ్రీరామ్ పాల్గొన్నారు.

మంథనిలో ఘనంగా ఘంటసాల వర్ధంతి



గాయకులను సన్మానిస్తున్న నిర్వాహకులు

నవతెలంగాణ-మంథని

ఘంటసాల వర్ధంతి నేపథ్యంలో మంథని సుమధుర గాయకులను మంథని విద్యార్థి యువత ఆధ్వర్యంలో ఘనంగా పాటల గాయకులను ఘనంగా సత్కరించారు. సోమవారం,ఆదివారం రెండు రోజులపాటు జరిగిన ఘంటసాల ఎనిమిదో వర్ధంతి కార్యక్రమం సంస్థ గత అధ్యక్షుడు కొండేల మారుతి అధ్యక్షతన నిర్వహించారు. ఘంటసాల గానామృత వీచికలను స్థానిక కళాకారులతో పాటల విభావరీ హోరెత్తింది. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ సభ్యుడు భోగోజు శ్రీనివాస్ మాట్లాడుతూ సినీ ఫీల్డ్ గ్రీన్ కారిడార్ అంటూ ఈ రంగంలో పాటలు అమృత మేఘాలుగా పయనిస్తాయనీ పేర్కొన్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో కొప్పుల పూజలు



నవతెలంగాణ-ధర్మారం

మండలంలోని నర్సింహుల పల్లె గ్రామంలో శ్రీ కోదండ రామాలయం, శివాలయం నిర్మించగా, ఆదివారం విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హాజరై పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో పాటు ప్రాథమిక సహకార సంఘాల జిల్లా అధ్యక్షుడు ముత్యాల బలరాం రెడ్డి మాజీ ఏఎంసీ చైర్మన్ గుర్రం మోహన్ రెడ్డి స్థానిక మాజీ సర్పంచ్ అడువాలా అరుణ జ్యోతి రవి ధర్మారం మాజీ సర్పంచ్ పూసుకూరి జితేందర్ రావులు పాల్గొన్నారు.

ఎస్టీపీపీ క్రికెట్ లీగ్-2024 చాంపియన్లుగా సోలార్ ఎనర్జీ

నవతెలంగాణ-జైపూర్



జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఆధ్వర్యంలో గత 10 సంవత్సరాలుగా ఆనవాయితిగా నిర్వహిస్తున్న క్రికెట్ లీగ్-2024 ముగిసింది. ఆదివారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో సోలార్ ఎనర్జీ జట్టుతో పవర్‌మేక్ గేమ్ చేంజర్స్ జట్టు తలపడింది. ఫైనల్ మ్యాచ్ టాస్ గెలిచి బ్యాటింగ్‌ను ఎంచుకున్న పవర్‌మేక్ గేమ్ చేంజర్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు నష్టపోయి 112 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సోలార్ ఎనర్జీ జట్టు 113 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగి నిర్ణీత 20 ఓవర్లలో 5 బాల్లు మిగిలిఉండగా 113 పరుగులు సాధించి చాంపియన్‌గా నిలిచింది. చాంపియన్‌గా నిలిచిన సోలార్ ఎనర్జీ జట్టు క్రీడాకారుడు రమేష్ 4 ఓవర్లలో కేవలం 21 పరుగులుకు 4 వికెట్లు పొంది మ్యాన్ ఆఫ్ దీ మ్యాచ్‌గా నిలిచాడు. అదేవిధంగా ఓవర్ ఆల్ టోర్నీలో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా 164 పరుగులు సాధించిన విజయ్, 13 వికెట్లు సాధించి బెస్ట్ బౌలర్‌గా మహేందర్‌గౌడ్, 5 క్యాచ్‌లు, 2 రన్ ఔట్లు సాధించి బెస్ట్ ఫీల్డర్‌గ చందు గుర్తింపు పొందారు. అదేవిధంగా మోస్ట్ వ్యాల్యేబుల్ ప్లేయర్‌గా క్రీడాకారుడు చందు అవార్డును సొంతం చేసుకున్నారు. ఫైనల్ మ్యాచ్‌కు ముందు సింగరేణి ఎస్టీపీపీ అధికారులకు పీఎంపీఎల్ అధికారులకు మధ్య జరిగిన ఫ్రెండ్లీ మ్యాచ్‌లో పీఎంపీఎల్ జట్టు విజయం సాధించింది. ఈ నెల 1న ప్రారంభించిన క్రికెట్ లీగ్ సీజన్-10లో చాంపియన్లుగా నిలచిన సోలార్ ఎనర్జీ జట్టు క్రీడాకారులతో పాటు రన్నర్లుగా నిలిచిన పవర్‌మేక్ గేమ్ చేంజర్ క్రీడాకారులకు ఎస్టీపీపీ జనరల్ మేనేజర్ బస్వీరెడ్డి ట్రోఫీలు అందజేశారు. ఎస్టీపీపీ ఆధ్వర్యంలో ఆనవాయితిగా కొనసాగిస్తున్న క్రికెట్ లీగ్‌గా నిర్వాహణలో కీలక పాత్ర పోషిస్తున్న చీఫ్ ఆర్గనైజర్ పంతులా నాయక్‌తో పాటు క్రీడాకారులను జీఎం బస్వీరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు సుబ్బారావు, అఖిల్ కపూర్, శ్రీనివాస్, ఏకే సింగ్, ఎఎస్ సింగ్, బ్రహ్మం పాల్గొన్నారు.

బీసీ బడ్జెట్‌పై అసెంబ్లీ నిలదీస్తాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు తగిన స్థాయిలో కేటాయింపులు జరగలేదని, దీనిపై అసెంబ్లీలో సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదివారం టీఎన్‌జీఓ సంఘ భవనంలో నిర్వహించిన బీసీ సంక్షేమ భవన ప్రారంభోత్సవ సభకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యే పాయల శంకర్ అతిథులుగా హాజరయ్యారు. తొలుత పక్కనే ఉన్న మొదటి అంతస్తులోని బీసీ సంక్షేమ సంఘ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం టీఎన్‌జీఓ భవనంలో నిర్వహించిన సభలో అతిథులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల శంకర్ మాట్లాడుతూ అసెంబ్లీలో బీసీల పక్షాన పోరాడే బాధ్యత తనదని పేర్కొన్నారు. 1999, 2004 అసెంబ్లి ఎన్నికల్లో టీడీపీ నుంచి బీసీ అభ్యర్థికి టిక్కెట్ దక్కేలా పార్టీ అధిష్టానంపై ఒత్తిడి చేసినట్లు గుర్తు చేశారు. పార్టీ నుంచి టిక్కెట్ రావడం, గెలవడం సాధ్యమేనా అనే సందేహం మాజీ మంత్రులు పడాల భూమన్న, జోగు రామన్నలకు ఉండేదన్నారు. బీసీలంతా ఒక్కటిగా నిలవడం వల్లే ఎన్నికల్లో గెలిచి రాష్ట్ర మంత్రుల స్థాయికి ఎదగడం జరిగిందన్నారు. మనలో కావాల్సిందే ఐక్యమత్యమని, అది ఉంటే ఏ శక్తి బీసీలను అడ్డుకోజాలదన్నారు. ధైర్యంగా ముందుకు సాగకపోవడమే వెనకబాటుకు కారణమవుతోందన్నారు. ప్రభుత్వం నుంచి బీసీలకు రావాల్సిన హక్కులు, నిధులను సాధించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. అనంతరం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీల రాజకీయ చైతన్యానికి నాంది పలికింది ఆదిలాబాద్ జిల్లాయేనని పేర్కొన్నారు. తెలంగాణ కోసం తొలుత రాజీనామా చేసింది కేసీఆర్ కాదని, కొండా లక్ష్మణ్ బాపూజీ అని, ఆ మహనీయుడు పుట్టిన జిల్లా ఇదన్నారు. పడాల భూమన్న నుంచి పాయల శంకర్ వరకు ఆదిలాబాద్ స్థానంలో బీసీ ప్రాతినిధ్యం కొనసాగుతోందని, ఇది మనలో వచ్చిన చైతన్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఎమ్మెల్యే పాయల శంకర్ భావి తరం బీసీ రాజకీయాలకు స్ఫూర్తిగా నిలుస్తారని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చిక్కల దత్తు, ప్రధాన కార్యదర్శి కలలా శ్రీనివాస్, సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, ఆయా పార్టీల నాయకులు గండ్రత్ సుజాత, ఆశన్న, ప్రవీణ్ కుమార్, నర్సాగౌడ్, జక్కుల శ్రీనివాస్, నవీన్ యాదవ్, కాసర్ల శ్రీనివాస్, రవీందర్, అంజన్ కుమార్, సత్యనారాయణ, మేకల అశోక్, ధోని జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ బంద్ సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలి

- 16న జరిగే బంద్ విజయవంతంకై బైక్ ర్యాలీ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నవతెలంగాణ-గోదావరిఖని:

కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా ఈనెల 16న జరిగే గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ), అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) సంఘాల ఆధ్వర్యంలో అంతర్గాం మండల కేంద్రం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమై పెద్దంపేట్, రామగుండం, గోదావరిఖని వరకు బైక్ ర్యాలీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఐ.కష్ణ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాల సంయుక్త ఈనెల 16న గ్రామీణ బంద్ పారిశ్రామిక సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని, మోడీ ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ల పరం చేసిందని. వ్యూహాత్మకంగా ప్రభుత్వ రంగ సంస్థల్లో 100శాతం వాటాలను అమ్మిందని, నేషనల్ మేనేజ్మెంట్ పైప్ లైన్ పాలసీ ద్వారా మౌలిక వసతులను లీజు పేరుతో ప్రైవేట్ పరుస్తుందన్నారు. ఈ విధానాలను వ్యతిరేకిస్తూ ఈ బంద్, సమ్మెలో కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ బైక్ ర్యాలీలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేష్, ప్రధాన కార్యదర్శి బి.అశోక్, ఉపాధ్యక్షుడు చిలుక శంకర్. జిల్లా నాయకుడు ఎం.దుర్గయ్య, బి.బుచ్చయ్య, ఎం.కొమరయ్య, కే.లింగమూర్తి, పి.మొండయ్య, ఎండీ. యూసఫ్, ఎల్ల రవికుమార్, ఏ.చంద్రయ్య, రాజయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మేరుగు చంద్రయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు కొల్లూరి మల్లేష్, రాజకొమురయ్య, వంతు ఆనంద్, రామస్వామి, రమేష్, ఏ.తిరుపతి, బాలకష్ణ, దూలం సతీష్, ఆర్.రాయమల్లు, గుండు రాజయ్య, శంకర్ తదితరులున్నారు.

కార్మిక చట్టాల, హక్కుల రక్షణ కోసం సమ్మె

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు





నవ తెలంగాణ-సుల్తానాబాద్

కార్మిక చట్టాల హక్కుల రక్షణ కోసమే సమ్మె అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యంరావు అన్నారు ఆదివారం పట్టణంలోని యశోద నరహరి ఫంక్షన్ హాల్ లో సుల్తానాబాద్ మండల రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ 6వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా సీఐటీయూ జెండాను యూనియన్ అధ్యక్షుడు తాండ్ర అంజయ్య ఆవిష్కరించారు.ఈ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 16 సమ్మె ఎందుకు? అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి గా హాజరైన ముత్యంరావు మాట్లాడుతూ మన పూర్వీకులు పోరాడే సాధించిన 29 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్చి, 8 గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచటం, కనీస వేతన చట్టాన్ని రద్దు చేయడం, సమ్మె హక్కును నిర్వీర్యం చేయడం, పీఎఫ్, బోనస్, ఈఎస్ఐ లాంటి సౌకర్యాలను తొలగించడం, లాంటి చర్యలతో కార్మికులను యజమా నులకు బానిసలుగా మార్చే వ్యవస్థను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీసుకువ స్తుందన్నారు. ఈ దుర్మార్గపు లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను యధా విధిగా కొనసాగించాలని, కనీస వేతనం నెలకు 26 వేల రూపాయలుగా నిర్ణయించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పట్టణాలకు విస్తరింప చేయాలని, 100 రోజుల పనిని 200 రోజులకు పెంచాలని, రోజుకూలి 600గా నిర్ణయించాలని తదితర 23 డిమాండ్లతో ఫిబ్రవరి 16న సమ్మె చేయడం జరుగుతుందన్నారు.ఈ ప్రాంతంలోని అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమ అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తాండ్ర అంజయ్య, కార్యదర్శిగా నౌపుండ్ల బ్రహ్మచారి, ఉపాధ్యక్షులుగా బండారి తిరుపతి, రవీందర్, విలాస్. బండారి రమేష్, సదయ్య కోశాధికారిగా పూసాల సంపత్, కార్యవర్గ సభ్యులు పోగుల లక్ష్మయ్య, దుర్గ మహేందర్, రావుల వెంకటేష్, వీరగోని కిరణ్, భూసారపు ఓదెలు బండారి స్వామిలను ఎన్నుకున్నారు.

ముత్తారం ఎంపీడీవో బదిలీ

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న కలికోట శ్రీనివాస్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆయనను రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2021లో ఇక్కడికి బదిలీపై వచ్చిన ఆయన మూడు సంవత్సరాల పాటు ఎంపీడీవోగా ఇక్కడ విధులు నిర్వర్తించారు.

చెరువులో బర్రెల కాపరి గల్లంతు



చెరువులో గాలిస్తున్న గజ ఈతగాళ్లు

నవతెలంగాణ-ముత్తారం:

ముత్తారం మండలం పోతారం గ్రామానికి చెందిన చల్ల లింగయ్య (55) అనే బర్రెల కాపరి చెరువు పడి గల్లంతయ్యాడు. వివరాల్లోకి వెళ్తే... ఆదివారం రోజూవారి లాగానే బర్రెలను మెపుతూ పారుపల్లి శివారులోని యాతల చెరువు వద్దకు మేతకు తీసుకు వెళ్లగా, బర్రెలు నీటిని తాగడం కోసం చెరువులోకి దిగాయి. బర్రెలు నీటి లోతులోకి వెళ్లే క్రమంలో వాటిని ఆపేందుకు సదరు బర్రెల కాపరి నీటిలో దిగి కొంత లోపటికి వెళ్లగా, మునిగి గల్లంతయ్యాడు. ఈ మేరకు ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు, మంథని మహిళా ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని గజఈత గాళ్లతో వెతికినా సాయంత్రం వరకు కూడా ఆచూకీ లభించలేదు. సంఘటన స్థలానికి జడ్పీటీసీ చెలుకల స్వర్ణలత అశోక్, ఎంపీటీసీ బియ్యాని శ్యామల సదానందం, మాజీ సర్పంచ్ నెత్తెట్ల మహేందర్ పర్యవేక్షించారు. గజ ఈతగాళ్లు ఎంత వెతికిన ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా

ఓటాన్ అకౌంట్ బడ్జెట్



సుతారి లక్ష్మన్ బాబు

నవతెలంగాణ-గోదావరిఖని:

రాష్ట్ర శాసన సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, శాసన మండలిలో ఐటీ, పరిశ్రమలు శాఖ సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ తెలంగాణ రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధికార ప్రతినిధి సుతారి లక్ష్మన్ బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో ఇచ్చిన ఎన్నికల హామీలు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ఇది నిదర్శనమని, అన్ని వర్గాల ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన అరు గ్యారంటీ పథకాల అమలు కోసం బడ్జెట్ కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఐటీ పరిశ్రమలు శాఖ, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర మంత్రులు సమిష్టిగా చేస్తున్న కృషికి ప్రజల్లో ఆదరణ పెరుగుతుందని పేర్కొన్నారు. మీరు మారకుంటే ప్రజా క్షేత్రంలో మీకు ప్రజలే బుద్ధి చెప్తారని పేర్కొన్నారు. దశల వారీగా ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేస్తూ పనిచేసే ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరూపించుకుంటూ రాష్ట్ర అభివృద్ధికి ప్రజాసంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఉదరత స్వభావం చాటుకున్న

మంత్రపురి చారిటబుల్ ట్రస్ట్



ఆర్థిక సహాయం అందజేస్తున్న మంత్రపురి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు

నవతెలంగాణ-మంథని

ఆపదలో ఉన్న వారికి సహాయం చేసి మంత్రపురి చారిటబుల్ ట్రస్ట్ వారు ఉదారత చాటుకున్నారు. ఆదివారం మంథని మండలం గోపాలపూర్ గ్రామానికి చెందిన నిరుపేదలు బొమ్మర స్వామి, అక్కమ్మల కుమార్తె జ్యోత్స్న వివాహం సందర్భంగా మంత్రపురి చారిటబుల్ ట్రస్ట్ వారు వివాహానికి కావాల్సిన గుంజులు, బొళ్ళు ఇచ్చి ఆర్థికంగా సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు నన్నేగారి రాము,గీట్ల భరత్ రెడ్డి, కొమురోజు మధు, మంథని లింగయ్య, దాసరి మొగిలి(కోటయ్య), ముత్తినేని స్వామి,అల్లం తిరుపతి,తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలి

డైరెక్టర్ ఆపరేషన్స్, పా ఎన్ వికే శ్రీనివాస్

నవతెలంగాణ-యైటింక్లయిన్ కాలనీ

ఆర్జీ-2 ఏరియాను సంస్థ డైరెక్టర్ ఆపరేషన్స్, పా ఎన్ వికే శ్రీనివాస్ ఆదివారం సందర్శించారు. వారు ముందుగా ఓసీపీ-3 వ్యూ పాయింట్ ద్వారా పని స్థలాలను పరిశీలించి ఉత్పత్తి మెరుగుదలకు చేపట్టాల్సిన పనులపైన ఏరియా అధికారులకు తగు సూచించారు. వారికి ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ ఏరియాలో ఉత్పత్తి లక్ష్యాలను సాధించుట కొరకు తీసుకుంటున్న చర్యలను, చేపడుతున్న ప్రణాళికల గురించి వివరించారు. అక్కడ నుంచి ఓసీపీ-3 ఫేజ్-2లో ఓవర్ బర్డన్ తొలగించు గుత్తేదారులతో మాట్లాడి బొగ్గు అవసరాల దృష్ట్యా ఉత్పత్తికి అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను అలాగే మట్టి వెలికితీత(ఓ.బి) ఎప్పటికప్పుడు తొలగిస్తూ ఈ ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యాలను భద్రతతో సాధించుకోవాలన్నారు. వారి వెంట ఏరియా జనరల్ మేనేజర్ ఎల్‌వీ సూర్యనారాయణ, ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, ప్రాజెక్ట్ ఇంజినీర్ రాజాజీ, సర్వే అధికారి నర్సింగరావులున్నారు.

మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-ధర్మారం



మండల కేంద్రానికి చెందిన గోల్కొండ రాజేశ్వరి (37)గత కొన్ని సంవత్సరాలుగా మూర్చ వ్యాధితో బాధపడుతుంది. శనివారం రాత్రి జీవితంపై విరక్తి చెంది ఇంట్లో అందరూ పడుకున్నాక రేకుల షెడ్డుకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని తల్లి నర్ర వెంకటమ్మ తెలిపారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై-2 ఎస్ అశ్విని తెలిపారు. మృతురాలి భర్త రాజేశం గత కొన్ని కొంతకాలంగా జీవనోపాధి కోసం దుబాయ్‌కి వెళ్లగా, మృతురాలికి ఒక కూతురు, ఒక కొడుకు ఉన్నారు. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టంకు కరీంనగర్ తరలించినట్లు ఎస్సై అశ్విని తెలిపారు.